తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

మెదక్ - మహబూబ్‌నగర్

సంగారెడ్డి | సిద్దిపేట

జోగులాంబ గద్వాల

వనపర్తి | నారాయణపేట

నాగర్ కర్నూల్

మంగళవారం

14 జూలై 2026


## ఉపముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు



**గద్వాల నడిగడ్డ, జులై 13 (జనంసాక్షి);**
ఉపముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఈనెల 14న వివిధ విద్యుత్ ఉపకేంద్రాల ప్రారంభోత్సవం కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వస్తున్నందున పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సోమవారం మల్దకల్ మండలం కుర్తి రావులచెరువు గ్రామంలో నూతనంగా నిర్మించిన విద్యుత్ ఉపకేంద్రాన్ని పరిశీలించారు. ఉప ముఖ్యమంత్రి కేంద్రం ప్రారంభోత్సవం అనంతరం సమీపంలో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారని కలెక్టర్ తెలిపారు. బహిరంగ సభ స్థలాన్ని పరిశీలించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామంలో ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ గురించి స్థానిక బూత్ లెవెల్ అధికారులతో మాట్లాడారు. గ్రామంలోని యువత, బిఎల్ఎలు, వాలంటీర్ల సహకారం తీసుకొని ఎన్నుమరేషన్ ఫారాలను పూరించాలన్నారు. ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, తహసిల్దార్ ఝాన్సీ రాణి, ఎంపీడీవో ఆంజనేయ రెడ్డి, గ్రామ సర్పంచ్ భగవంతు, విద్యుత్ శాఖ అధికారులు, నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక సమగ్ర సవరణ అనేది యుద్ధం లాంటింది.. అందరూ సైనికుల్లా పనిచేయాలి

- తెలంగాణ సాంస్కృతిక కార్పొరేషన్ చైర్మన్ వెన్నెల గద్దర్
- సర్ ప్రక్రియ వేగవంతం కోసం బిఎల్ఏలకు, నాయకులకు దిశా నిర్దేశం చేసిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి
- టీజీ ఐఐసీ కార్పొరేషన్ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి







**సంగారెడ్డి జులై 13 (జనంసాక్షి):** ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) అనేది ఒక యుద్ధం లాంటిదని, దీన్ని ఎదుర్కొనేందుకు ప్రతీ ఒక్క కాంగ్రెస్ కార్యకర్త సైనికుని లాగా పోరాడాలని తెలంగాణ సాంస్కృతిక శాఖ కార్పొరేషన్ చైర్ పర్సన్ వెన్నెల గద్దర్ అన్నారు. సోమవారం సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బిఎల్ఏ, ముఖ్య నాయకుల సమావేశం జి ఆర్కె ఫంక్షన్ హాల్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె హాజరయ్యారు.
ఈ కార్యక్రమానికి హాజరైన టీపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సమగ్ర సవరణ పై కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. బిఎల్వోలు మీ దగ్గరకు రాకున్నా మీరే వెళ్లాలని బిఎల్ఏలు, నాయకులకు సూచించారు. ఓట్ నమోదు కాకపోతే వ్యక్తిగతంగా ఓటర్‌కే నష్టం కాబట్టి ఓటర్‌లు కూడా తమ ఓట హక్కును నమోదు చేసుకోవాలనే ఆతృత, ఆసక్తి ఉండాలన్నారు.
డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ రానున్న ఐదురోజుల్లోనే సర్ ప్రక్రియ పూర్తి అయ్యేలా పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ పని మనది, మన సంగారెడ్డి కోసం పని చేస్తున్నామనే విషయాన్ని దృష్టిలో పెట్టుకుని పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి నియోజకవర్గ కన్వీనర్ చేర్యాల ఆంజనేయులు, టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, సంగారెడ్డి, సదాశివపేట మున్సిపల్ చైర్‌పర్సన్‌లు కూన వనితా సంతోష్, అంజమ్మ సత్యనారాయణ, నాయకులు కూన సంతోష్, షఫీ హఫీజ్, కిరణ్ గౌడ్, రఘు గౌడ్, జార్జ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు పాల్గొన్నారు

## ప్రతి సంస్థలో పోష్ చట్టం అమలు తప్పనిసరి

- ప్రభుత్వ కార్యాలయాల్లో 235, ప్రైవేట్ సంస్థల్లో 97 అంతర్గత ఫిర్యాదు కమిటీలు
- పోష్ చట్టం అమలుపై అదనపు కలెక్టర్ నగేష్



**మెదక్ బ్యూరో చీఫ్ , జూలై 13 ( జనం సాక్షి):**
ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో మహిళలకు సురక్షితమైన, గౌరవ ప్రదమైన పని వాతావరణాన్ని కల్పించడం ప్రతి సంస్థ బాధ్యత అని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ పేర్కొన్నారు. కార్యాలయాల్లో మహిళలపై లైంగిక వేధింపుల (నివారణ, నిషేధం మరియు పరిష్కారం) చట్టం–2013 ను ప్రతి సంస్థ కచ్చితంగా అమలు చేయాలని ఆయన సూచించారు.
సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళలపై లైంగిక వేధింపుల నివారణపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు.
జిల్లాలో మహిళల భద్రత కోసం ప్రభుత్వ కార్యాలయాల్లో 235, ప్రైవేట్ సంస్థల్లో 97 అంతర్గత ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 10 మంది లేదా అంతకంటే ఎక్కువ మంది ఉద్యోగులు పనిచేసే ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలో ఐసీసీ ఏర్పాటు చేయడం చట్టబద్ధమైన బాధ్యత అని స్పష్టం చేశారు. అంతర్గత ఫిర్యాదుల కమిటీలో మహిళా అధ్యక్షురాలు, ఉద్యోగుల ప్రతినిధులు, మహిళా హక్కుల అంశాల్లో అనుభవం కలిగిన బాహ్య సభ్యుడు ఉండాలని వివరించారు. మహిళలపై లైంగిక వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులను గోప్యంగా విచారించి, చట్టం నిర్దేశించిన గడువులో పరిష్కరించే బాధ్యత యాజమాన్యానిదేనని చెప్పారు.
ఉద్యోగులందరికీ పోష్ చట్టంపై అవగాహన కల్పించేందుకు తరచూ శిక్షణా కార్యక్రమాలు, అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. ప్రతి మహిళ భయాందోళనలు లేకుండా, గౌరవంతో పనిచేసే వాతావరణాన్ని కల్పించడం ప్రతి సంస్థ సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు.
లైంగిక వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులు నమోదు చేయడానికి కేంద్ర ప్రభుత్వ 'షీ–బాక్స్' పోర్టల్‌ను వినియోగించుకోవచ్చని అదనపు కలెక్టర్ తెలిపారు.
ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి తదితర అధికారులు పాల్గొన్నారు.

## జర్నలిస్టు సంఘం నేత యాదగిరిని సన్మానించిన హరీష్ రావు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్!

- అభినందించిన పలువురు నేతలు



**సంగారెడ్డి జులై 13 (జనంసాక్షి):** తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు టియుడబ్ల్యూజే ఐజేయు సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన బండారు యాదగిరి బి ఆర్ ఎస్ శాసనసభాపక్ష ఉప నేత హరీష్ రావు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సోమవారం సాయంత్రం శాలువాతో సత్కరించారు. సంగారెడ్డిలోని చింత ప్రభాకర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం సాయంత్రం హరీష్ రావు మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టియుడబ్ల్యూజే ఐజేయు నూతన కార్యవర్గ ఎన్నిక గురించి జిల్లా మహాసభ గురించి న సమాచారం కొందరు నాయకులు హరీష్ రావుకు తెలిపారు. దీంతో వెంటనే అక్కడనే ఉన్న జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరికి హరీష్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. శాలువా కప్పి అభినందించారు. రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు భుజం తట్టారు. ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కూడా శాలువాకప్పి బండారు యాదగిరిని సన్మానించారు. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ శివకుమార్, టీఎన్జీవో రాష్ట్ర మాజీ నేత రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, బిఆర్ఎస్ నేతలు కాసాల బుచ్చిరెడ్డి, విజేందర్రెడ్డి, చింత సాయినాథ్, గోవర్ధన్ నాయక్, జీవి శ్రీనివాస్ షేక్ సాబేర్ ,శ్రీధర్ రెడ్డి, మల్ల గౌడ్, తదితరులు టి యు డబ్ల్యూ జే ఐ జేయు అధ్యక్షుడు బండారు యాదగిరికి శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

## బోర్ భవనం కూల్చివేత.. మట్టి తరలింపుపై కలెక్టర్‌కు ఫిర్యాదు



**అల్లాదుర్గం జూలై 13 (జనంసాక్షి):** అల్లాదుర్గం మండల పరిధిలోని గడి పెద్దాపూర్ గ్రామంలో గత నలభై ఏళ్ల క్రితం ప్రభుత్వం తరపున ఏర్పాటు చేసిన బోరు నీటి భవనాన్ని, సంబంధిత శాఖల అనుమతి లేకుండా సర్పంచ్ మద్దతుతో అక్రమంగా కూల్చి వేసిన ఘటనపై , అలాగే పెద్ద చెరువులో రైతుల పేరుతో అక్రమార్కులు నల్లమట్టి తరలింపు పై సోమవారం గ్రామస్తులు సంతకాలు స్వీకరించి అడిషనల్ కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ 40 సంవత్సరాల క్రితం గ్రామ ప్రజల దాహార్తిని తీర్చేందుకు అప్పటి పాలకులు నిర్మించిన బోరు బావి, తో పాటు భవనాన్ని ప్రస్తుతం ఉన్న సర్పంచ్ మద్దతుతో ఇరిగేషన్, ఆర్ డబ్ల్యు.ఎస్ అధికారుల అనుమతులు లేకుండా ప్రైవేట్ వ్యక్తుల కోసం అక్రమంగా కూల్చిన ఘటనపై పూర్తి విచారణ జరిపించి గ్రామ ప్రజలకు న్యాయం చేయాలని వారు కోరారు. అలాగే గత కొన్ని నెలలుగా గ్రామంలో అక్రమంగా మట్టి, మొరం తరలింపును ఆపాలని ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగించే విధంగా జరుగుతున్న ఈ అక్రమ కార్యక్రమాలను అరికట్టడంతో పాటు గ్రామ సహజ వనరులు, మరియు ప్రభుత్వ భూములను పరిరక్షించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మరువెల్లి కృష్ణ గౌడ్, నిరంజన్, ఆంజనేయులు, వార్డు సభ్యులు విజయ్ ,అనిల్, యువజన నాయకులు కృష్ణ కుమార్ , గణేష్ తో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఆరోగ్యమే లక్ష్యం



**పెద్ద శంకరంపేట, జూలై 13 (జనంసాక్షి):** పెద్ద శంకరంపేట పీహెచ్సీ ఆధ్వర్యంలో సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ షర్ఫుద్దీన్ విద్యార్థులకు నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వేణుశేఖర్, ప్రిన్సిపల్ శోభారాణి, హెచ్ఐవో యాదయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# పాత వెంచర్ ప్లాట్ల రిజిస్ట్రేషన్‌పై నిషేధం ఉపసంహరించుకోవాలి

**• బీఆర్ఎస్ జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్**



**వనపర్తి రూరల్, జూలై 13, (జనంసాక్షి):** పాత వెంచర్ ప్లాట్ల రిజిస్ట్రేషన్‌పై ప్రభుత్వం విధించిన నిషేధం రాష్ట్ర రియల్ ఎస్టేట్ రంగానికి తీవ్ర దెబ్బగా మారిందని బీఆర్ఎస్ జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ విమర్శించారు. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం వల్ల ఇప్పటికే మందగమనంలో ఉన్న రియల్ ఎస్టేట్ రంగం మరింత సంక్షోభంలోకి నెట్టబడిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గతంలో ఎల్ఆర్ఎస్ (గాా) ఫీజు చెల్లించిన పాత వెంచర్ ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించడం వల్ల రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కొంత ఊరట లభించిందన్నారు. అయితే ఇటీవల ప్రభుత్వం జి.ఓ. నం. 5509/2025ను అమల్లోకి తెస్తూ పాత వెంచర్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లపై నిషేధం విధించడం వల్ల వ్యాపారులు, మధ్యవర్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ రంగంపై ఆధారపడి జీవిస్తున్న డెవలపర్లు, బ్రోకర్లు, ఏజెంట్లు, అనుబంధ వృత్తుల వారు ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. గతంలో కోట్ల రూపాయలు పలికిన భూముల ధరలు ప్రస్తుతం భారీగా పడిపోయాయని, కొనుగోలుదారులు లేక మార్కెట్ పూర్తిగా స్తబ్దుగా మారిందని తెలిపారు. రియల్ ఎస్టేట్ రంగంలో నెలకొన్న సంక్షోభం ప్రభావం నిర్మాణ రంగం, వ్యాపార రంగం, ఉపాధి అవకాశాలపై కూడా పడుతోందని అశోక్ పేర్కొన్నారు. భూములు విక్రయించలేక అనేక కుటుంబాలు పిల్లల వివాహాలు, గృహ నిర్మాణాలు, ఉన్నత విద్య వంటి అవసరాలను వాయిదా వేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. రియల్ ఎస్టేట్ రంగాన్ని ఆదుకునేలా ప్రభుత్వం వెంటనే పాత వెంచర్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లపై విధించిన నిషేధాన్ని ఉపసంహరించుకుని, రంగం పునరుద్ధరణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గంధం పరంజ్యోతి, జోహెబ్ హుస్సేన్, చిట్యాల రాము తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులకు అల్బెండాజోల్ పంపిణీ



**ధన్వాడ, జూలై 13 (జనంసాక్షి):** జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ధన్వాడ మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, జూనియర్ కళాశాలల్లో అర్హులైన చిన్నారులకు అల్బెండాజోల్ మాత్రలను పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా మొత్తం 7,463 మంది చిన్నారులకు అల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు వైద్యాధికారి డాక్టర్ అనూష తెలిపారు. నులిపురుగుల నివారణతో పిల్లల్లో పోషకాహార లోపం తగ్గి ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు శారీరక, మానసిక ఎదుగుదలకు దోహదపడుతుందని ఆమె పేర్కొన్నారు. నేడు మాత్రలు తీసుకోలేక పోయిన చిన్నారులకు జూలై 20న నిర్వహించే మాప్-అప్ కార్యక్రమంలో అల్బెండాజోల్ మాత్రలు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతంగా నిర్వహించారు.

## గుప్తనిధుల తవ్వకాలు అవాస్తకం

**• ఎస్సై శ్రీనివాస్ యాదవ్**



**మిడ్జిల్, జులై 13(జనంసాక్షి):** వాడ్యాల గ్రామంలో గుప్తనిధుల తవ్వకాలు జరుగుతున్నాయంటూ ప్రచారం అయిన వార్తలు పూర్తిగా అవాస్తవమని స్థానిక ఎస్సై శ్రీనివాస్ యాదవ్ అన్నారు ఆదివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు పోలీసుల విచారణలో
పెద్దాయపల్లి గ్రామానికి చెందిన జుట్టు ఆనంద్ s/o భీమయ్య అనే వ్యక్తి తన పనుల నిమిత్తం Water Flow Checking Machineను తీసుకొని వాడ్యాల గ్రామ సమీపంలో వెళ్తుండగా, గ్రామస్థులు ఆ యంత్రాన్ని గుప్తనిధులను గుర్తించే యంత్రంగా అనుమానించి మిడ్జిల్ పోలీసులకు సమాచారం అందించారు.
సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని, జుట్టు ఆనంద్‌ను మరియు సంబంధిత యంత్రాన్ని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి పరిశీలించారు. విచారణలో అది Water Flow Checking Machine మాత్రమేనని నిర్ధారణ కావడంతో, ఎలాంటి అక్రమ కార్యకలాపాలు లేవని తేల్చి, అతడిని విడుదల చేయడం జరిగింది.కావున, వాడ్యాల గ్రామంలో గుప్తనిధుల తవ్వకాలపై ప్రచారం అవుతున్న వార్తలను ప్రజలు నమ్మవద్దని, నిర్ధారణ లేని సమాచారాన్ని సోషల్ మీడియా లేదా ఇతర మాధ్యమాల్లో ప్రచారం చేయవద్దని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## నులిపురుగుల నివారణతో చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ సాధ్యం

**• వైద్య అధికారిని డాక్టర్ స్వప్న**

**ఉప్పునుంతల, (జనంసాక్షి):** ఉప్పునుంతల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ స్వప్న ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ హెచ్ఎస్ పాఠశాలలో సోమవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వప్న మాట్లాడుతూ, ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయడం ద్వారా నులిపురుగుల సమస్యను నివారించడంతో పాటు రక్త హీనత, పోషకాహార లోపం వంటి ఆరోగ్య సమస్యలను తగ్గించవచ్చని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మొత్తం 3,971 మంది చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేయనున్నట్లు చెప్పారు. మాత్రలు తీసుకోలేని పిల్లలకు ఈ నెల 20వ తేదీన నిర్వహించే మాప్-అప్ డే సందర్భంగా మాత్రలు వేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సీహెచ్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు శ్యాంసుందర్, ఎంపీహెచ్ ఈఓ మధునాయక్, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జిపిఎచ్ఎస్‌కు నూతన భవనం నిర్మించాలి




**నారాయణపేట, జూలై 13(జనంసాక్షి):** నారాయణపేట జిల్లా కేంద్రంలో నీ పురాతన పాఠశాల అయిన జిపిఎచ్ఎస్‌కు నూతన భవనం నిర్మించాలనీ సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో భారతీయ విద్యార్థి పరిషత్, నారాయణపేట శాఖ ఆధ్వర్యంలో ఏబీవీపీ నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఒకవేళ యాదగిరి రోడ్లోకి మార్చినట్లయితే ప్రస్తుతం ఉన్న పరిసర ప్రాంత విద్యార్థులకు పాఠశాల దూరం అవుతుందని భావనతో వారు పాఠశాలకు వెళ్లలేరన్నారు. దీనితో పాఠశాల విద్యార్థులుసంఖ్య ణియంగా పడిపోతుందన్నారు.ఈ పాఠశాల నిర్మాణ ప్రభుత్వము కూడా సిద్ధంగా ఉన్నది కానీ ప్రభుత్వ స్థలంలేక నిర్మాణం చేపట్టలేదన్నారు.ప్రస్తుతం పాఠశాల ఉన్న దగ్గర్లోనే ఎక్కడైనా ప్రభుత్వ స్థలం గుర్తించి అట్టి స్థలం లోనే పాఠశాల నూతన భవనం నిర్మాణము చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ నరేష్ ,నగర కార్యదర్శి సతీష్, చరణ్ రెడ్డి, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



**వెల్దండ, జులై 13 (జనంసాక్షి):**
వెల్దండ మండల కేంద్రానికి చెందిన బయ్య జగదీష్ ఆదివారం మధ్యాహ్నం గుండెపోటుతో అకస్మాత్తుగా మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు కానుగుల జోగయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయంగా 5000 రూపాయలను అందజేశారు. కుటుంబం అధైర్య పడకుండా ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నిరంజన్,లింగం,వార్డు సభ్యులు సిర్సనగండ్ల శేఖర్,కొమ్ము నాగయ్య,బిట్టి సైదులు,పిల్లి శ్రీను, జంగిలి సంజీవ,దేవదాసు,తుంగ శ్రీను, సింగరాజు రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## SIR కార్యక్రమంపై పర్యవేక్షణ



**ఉప్పునుంతల, (జనంసాక్షి):** టీపీసీసీ ఉపాధ్యక్షులు, డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ ఆదేశాల మేరకు ఉప్పునుంతల మండల కేంద్రంలో నిర్వహించిన SIR సమీక్ష సమావేశంలో ఉప్పునుంతల గ్రామ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చింతగళ్ల శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ BLOలు, BLAలకు ఎన్యూమరేషన్ ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని సూచనలు చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విధులను బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ, ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సలహాలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అరుణ నరసింహారెడ్డి, సంబంధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ జాబితా సేకరణలో నిమగ్నమైన రెవిన్యూ అధికారులు



**నర్వ, జులై 13 (జనంసాక్షి):** నర్వ మండల పరిధిలో సీపూర్ గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా చేపట్టిన సర్ ప్రోగ్రామ్ లో భాగంగా ఓటర్ల జాబితా సేకరణలొ మండల రెవిన్యూ కార్యాలయం సిబ్బంది, సీనియర్ అసిస్టెంట్,శ్రీశైలం బిఎల్ఓలను అప్రమత్తం చేస్తూ సర్‌లొ వచ్చిన సమస్యలను పరిష్కారం చేస్తూ తగు సూచనలు ఇస్తూ అన్ని గ్రామాలు సందర్శిస్తూ, ఏమ్ఆర్ఓ మల్లారెడ్డి సూచనల మేరకు పనిలొ వేగంపెంచి ఇప్పటికే 60 శాతం ఓటర్ జాభిత పూర్తి చేశారు. త్వరలోనే వంద శాతం పూర్తి చేస్తామని అందుకు ప్రజలు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలొ జూనియర్ అసిస్టెంట్ వెంకటేష్ పాల్గొన్నారు.

## పార్ట్‌టైమ్ ఇన్స్ట్రక్టర్లను యదా స్థానంలో ఉంచాలి



**నారాయణపేట, జూలై 13(జనంసాక్షి):** జిల్లాలో పనిచేస్తున్న పార్ట్‌టైమ్ ఇన్స్ట్రక్టర్లను యధాస్థానంలో ఉంచాలని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఉద్యోగులు విన్నవించారు. వర్క్ అడ్జస్ట్మెంట్‌లో నుండి పార్ట్‌టైం ఇన్స్ట్రక్టర్స్‌ని తొలగించాలని చూడడం సారి కాదని పేర్కొన్నారు. ఉన్న స్థానంలోనే వారిని కొనసాగించాలని, కళా విద్యను, వృత్తి విద్యను ఉన్నత పాఠశాలలో అభివృద్ధి చెందేలా ఉన్న స్థానాన్ని కొనసాగించాలని కలెక్టర్ కి వినతి పత్రం అందజేశారు.

## విద్యార్థులకు నులిపురుగుల మాత్రల పంపిణీ

**ఇటిక్యాల, జులై 13 (జనంసాక్షి):**
విద్యార్థులు అందరూ ఆరోగ్యవంతులుగా ఉండేందుకు ప్రభుత్వం నులిపురుగుల కార్యక్రమంను ప్రవేశపెట్టిందని ఇటిక్యాల పిహెచ్ సి డాక్టర్ రాధిక అన్నారు. సోమవారం ఇటిక్యాల మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో సర్పంచ్ జీవేందర్ రెడ్డి, ఎంపీడీవో రమాదేవితో కలిసి విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. 1-19 వయసు గల వారందరికీ ప్రభుత్వం ఈ మాత్రలను పంపిణీ చేయనున్నట్లు ఆమె తెలిపారు. సోమవారం నులిపురుగుల మాత్రలు వేయించుకొని మిగతా విద్యార్థులకు ఈనెల 20న పంపిణీ చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

# ప్రభుత్వం వెంటనే ఏకీకృత సర్వీసు రూల్ రూపొందించాలి

- పిఆర్‌టియు టీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్.నర్సింగరావు



**నారాయణపేట, జూలై 13(జనంసాక్షి):** ప్రభుత్వం ఉపాధ్యాయులు ఏకీకృత సర్వీస్ రూల్ రూపొందించాలని పిఆర్‌టీయు రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింగ్‌రావు కోరారు. సోమవారం పిఆర్‌టియుటిఎస్ నారాయణపేట పట్టణ శాఖ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలికల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల మార్కెట్ లైన్ లో పిఆర్టియుటిఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమంను పట్టణ శాఖ అధ్యక్షురాలు వాణిశ్రీ,ప్రధాన కార్యదర్శి జహీరోద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నరాష్ట్ర ఉపాధ్యక్షులు నర్సింగ్ రావు మాట్లాడుతూ వెంటనే ఏకీకృత సర్వీస్ రూల్స్ ను రూపొందించి మండల విద్యాధికారులను, లెక్చరర్ పోస్టులను డిప్యూటీఈ వో పోస్టులను ప్రమోషన్ల ద్వారా నింపాలని డిమాండ్ చేశారు. అదే విధంగా పిఆర్టీయు సంఘము అన్ని యాజమా న్యాల ఉపాధ్యాయుల సంక్షేమం కోసం కృషి చేస్తుందని త్వరలోనే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధించబడతాయని ఆశాభవాన్ని వ్యక్తం చేశారు. పిఆర్టీయు సంఘం ఉపాధ్యాయులకు ఎ చిన్న కష్టం వచ్చినా కుటుంబం లాగా ఆదుకుంటుందని అన్నారు.ప్రభుత్వము తమ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా కాంట్రిబ్యూటర్ పెన్షన్ స్కీమును రద్దుచేసి వెంటనే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని అన్నారు. సిపిఎస్ రద్దు కోసం జరిగే అన్ని పోరాటాలకు పి ఆర్టీయూ సంఘం బేసరత్తుగా మద్దతిస్తుందని ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ అన్నారు. మూడు సంవత్సరాలగా పెండింగ్లో పెట్టిన పిఆర్సి నివేదికను వెంటనే తెప్పించుకొని 51 శాతం ఫిట్మెంట్తో పిఆర్సిని అమలు చేయాలని లేని పక్షంలో ఉద్యమ బాట పట్టడానికి సంఘం సిద్ధంగా ఉందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జిల్లా అధ్యక్షులు వై జనార్దన్ రెడ్డి మండల అధ్యక్షులుఎం.రఘువీర్ ప్రధాన కార్యదర్శి ఎం. జనార్ధన్,రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కె.శ్రీనివాస్ జిల్లా కార్యవర్గ సభ్యులు సాయిలు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మొహమ్మద్ హనీఫ్, జయంత్, సునీత పాఠశాలల ఉపాధ్యాయ బృందం వినోద్ కళ్యాణి బసవరాజ్ శశికళ పర్వీన్ అబ్దుల్ హాక్ శ్రీనివాస్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో 7 ఫిర్యాదులు స్వీకరణ

- ఫిర్యాదులను స్వీకరించిన జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్



**నాగర్‌కర్నూల్, జూలై 13 (జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ డా.సంగ్రామ్ సింగ్ జి.పాటిల్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు సూచనలు చేశారు. సోమవారం నాడు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి వచ్చిన 07 అర్జీలలో భూమికి సంబంధించిన అర్జీలు 05, తగు న్యాయం సంబంధించిన అర్జీలు 02, స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్ కి పరిష్కారానికి సూచనలు చేయడం జరిగింది. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీస్ సేవల్ని వినియోగించుకుంటూ, వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకునేలా, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని జిల్లా సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ తెలియజేశారు.

# కౌలు రైతులకు రైతు భరోసా అమలు చేయాలి

- ఆర్డీవోకు మాల మహానాడు వినతి



**నర్సాపూర్, జులై 13 (జనంసాక్షి):** ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కౌలు రైతులకు రైతు భరోసా పథకాన్ని అమలు చేయాలని కోరుతూ జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో సోమవారం నర్సాపూర్ ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాల మహానాడు నాయకులు మాట్లాడుతూ, రాష్ట్రంలో కౌలు రైతుల్లో సుమారు 80 శాతం మంది దళిత వర్గాలకు చెందిన వారేనని పేర్కొన్నారు. భూమి సొంతం లేకపోయినా వ్యవసాయాన్ని నమ్ముకొని జీవనం సాగిస్తున్న కౌలు రైతుల ఆవేదనను ప్రభుత్వం గుర్తించాలని, ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా వారికి రైతు భరోసా అందించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు సంజీవ్ జిల్లా ఉపాధ్యక్షుడు తాళ్ల ఆనంద్ కుమార్, యువజన అధ్యక్షుడు దాడిగా నరేష్, ఎంఆర్పీఎస్ జిల్లా సీనియర్ నాయకుడు మన్నె బిక్షపతి, నవీన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నశంకరంపేట ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎకగ్రీవ ఎన్నిక



**చిన్నశంకరంపేట, జూలై 13 (జనంసాక్షి):** చిన్నశంకరంపేట మండల టియుడబ్ల్యూజే (ఐజేయు) ప్రెస్‌క్లబ్ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సంధిగారి చంద్రం గౌడ్, గౌరవ అధ్యక్షుడిగా వెంకన్న బాబు, ప్రధాన కార్యదర్శిగా కుమ్మరి యాదగిరి, ఉపాధ్యక్షులుగా గిరుకల యాదగిరి, రాచర్ల నరేందర్, అరుణ్ యాదవ్, సలహాదారులుగా తాటికొండ సుధాకర్, మురళి, కోశాధికారిగా నరేష్ గౌడ్, కార్యదర్శిగా పడిగాజి సందీప్ కుమార్, ప్రభాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా కమ్మరి దేవరాజ్, సంతోష్ గౌడ్, కృష్ణగౌడ్, ప్రవీణ్ కుమార్, కుమ్మరి నవీన్, లక్ష్మణ్‌లను నియమించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు చంద్ర గౌడ్ మాట్లాడుతూ జర్నలిస్టుల నిరంతరం పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే ఐజేయు జిల్లా జాయింట్ సెక్రెటరీ ఆంజనేయులు గౌడ్ పాల్గొన్నారు.

# అక్రమంగా ఇసుక రావాన..

# ఫోన్ చేసినా లిఫ్ట్ చేయని తాసిల్దార్ సింధు రేణుక

**మెదక్, జులై 13 (జనంసాక్షి):** మెదక్ జిల్లా హవెలి ఘనపూర్ మండలం సర్దన గ్రామంలో సోమవారం ఉదయం నుండి సాయంత్రం 8గంటల వరకు అక్రమంగా ఉస్కె రవాణా జరుగుతున్న పట్టించుకోని స్థానిక తహసిల్దార్ సింధు రేణుక మధ్యతరగతి ప్రజలు ఉష్కె కావాలని ఎమ్మార్వో ఆఫీస్ కి పోయి మూడు డాక్టర్లకు ఇష్క్ కావాలని పర్మిషన్ ఇవ్వమంటే ఆన్లైన్లో బుక్ చేసుకోమని చెప్పి పోపో అని పంపించే తాసిల్దార్ సింధూ రేణుక సర్దన గ్రామంలో సోమవారం నాడు అక్రమంగా రవాణా నడుస్తున్న ఎందుకు పట్టించుకోలేదు ఒక జర్నలిస్టు ఫోన్ చేసిన లిఫ్ట్ చేయలేని బిజీగా ఉన్న తాసిల్దార్ ముడుపులు ముట్టిన కారణంగా ఫోను సైలెంట్లో పెట్టుకొని ఏమి తెలియనట్టుగా సమాధానం చెబుతున్న హవెలి ఘనపూర్ తాసిల్దార్ సింధు రేణుక హవేలు ఘనపూర్ నుండి వెంటనే ట్రాన్స్ఫర్ చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు సామాన్యులకు ఒక తీరు రాజకీయ నాయకులు ఒత్తిళ్లకు ఒక విధంగా ఒక తీరు ముడుపులు ఎవరు ఇస్తే వాళ్లకు ఒక రకంగా తెలిసిన పట్టించుకోని స్థానిక తాసిల్దార్ సర్ పక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ మీటింగ్ పెట్టి ప్రజలను చైతన్య పరుస్తుంటే గన్ పూర్ తాసిల్దార్ ఇంతవరకు ఒక విలేజ్ కి పోయి సర్ ఫక్రియ ఎలా జరుగుతున్నది సరూ ఫక్రియ అని ఏ ఒక్క విలేజ్ కి పోనీ తాసిల్దార్ కమర్షియల్ లో ఫాస్ట్ అందుకే హవేలీ ఘనపూర్ మండల ప్రజలు సింధూఖ ఇకనుండి ట్రాన్స్ఫర్ చేయాలని జిల్లా కలెక్టర్ ను మరియు స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావును కోరుతున్నారు.

# మద్యం మత్తులో కిందపడి వ్యక్తి మృతి



**అమీన్పూర్, జూలై 13 (జనంసాక్షి):** మద్యం మత్తులో కిందపడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన అమీన్పూర్‌లో చోటు చేసుకుంది. అమీన్పూర్ ఎస్సై విజయ్ కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం ఫతేనగర్ ఎర్రగడ్డ చెందిన మహమ్మద్ రియాజ్ (35) కూరగాయల వ్యాపారం చేస్తుంటాడు.

నిత్యం మద్యం సేవించి ఇష్టానుసారంగా తిరిగేవాడిని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆదివారం రాత్రి మద్యం సేవించి నవ్య నగర్ కాలనీ నుంచి అమీన్పూర్ వెళ్లే దారిలో బండరాళ్లపై పడడంతో ముఖంపై తీవ్ర గాయాలు అయ్యి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# విద్యార్థులకు సహాయం చేయడమే నిజమైన సామాజిక సేవ

- గౌతోజీగూడెం ఉప సర్పంచ్ ఎర్రనాగరాజు
- సొంత నిధులతో బస్ పాసులు అందజేసిన ఉప సర్పంచ్ ఎర్ర నాగరాజు
- ముఖ్య అతిథులుగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నత్తి మల్లేష్ ముదిరాజ్, మండల అధ్యక్షుడు వెంకటేష్



**మనోహరాబాద్, జూలై 14 (జనంసాక్షి):** మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం గౌతోజీగూడెం గ్రామంలో విద్యార్థుల విద్యాభ్యాసానికి ప్రోత్సాహం అందించే లక్ష్యంతో గ్రామ ఉప సర్పంచ్ ఎర్ర నాగరాజు తన సొంత నిధులతో విద్యార్థులకు ఉచిత బస్ పాసులను అందజేశారు. ఈ బస్ పాసుల పంపిణీ కార్యక్రమం గ్రామంలో ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిద్దిపేట జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి నత్తి మల్లేష్ ముదిరాజ్, మనోహరాబాద్ మండల బీజేపీ అధ్యక్షుడు వెంకటేష్ హాజరై విద్యార్థులకు బస్ పాసులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నత్తి మల్లేష్ ముదిరాజ్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులు రవాణా ఖర్చుల కారణంగా చదువుకు దూరం కాకుండా ఉండేందుకు ఉప సర్పంచ్ ఎర్ర నాగరాజు తన సొంత డబ్బులతో బస్ పాసులు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుపై పెట్టుబడి పెట్టడమే నిజమైన సామాజిక సేవ అని, ప్రజాప్రతినిధులు సమాజం పట్ల ఇలాంటి బాధ్యతతో ముందుకు రావాలని అన్నారు. మండల అధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడుతూ గ్రామ విద్యార్థుల అవసరాలను గుర్తించి వారికి వెంటనే బస్ పాసులు అందించడం ఉప సర్పంచ్ నాగరాజు సేవాభావానికి నిదర్శనమని కొనియాడారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

ఉప సర్పంచ్ ఎర్ర నాగరాజు మాట్లాడుతూ, గ్రామంలోని ఏ విద్యార్థి కూడా రవాణా సమస్యల కారణంగా చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో తన సొంత ఖర్చులతో బస్ పాసులు అందజేశానని తెలిపారు. భవిష్యత్తులో కూడా విద్యార్థుల సంక్షేమం, గ్రామాభివృద్ధికి తన వంతు సహకారం కొనసాగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ బూత్ అధ్యక్షుడు ఎర్ర శేఖర్, పార్టీ నాయకులు, గ్రామ ప్రముఖులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. తమకు ఉచితంగా బస్ పాసులు అందించిన ఉప సర్పంచ్ ఎర్ర నాగరాజుకు విద్యార్థులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

# వర్షాలు కురవాలని శివలింగానికి జలాభిషేకం చేసిన గ్రామస్తులు



**చిన్నంబావి, జులై 13 (జనంసాక్షి):** మండలంలోని గూడెం గ్రామంలో వర్షాలు కురవాలని కోరుతూ సోమవారం గ్రామస్తులు శివాలయంలో ప్రత్యేక పూజలు, జలాభిషేకం నిర్వహించారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పొలాల్లో విత్తిన విత్తనాలు మొలకెత్తకపోవడం, మొలకెత్తిన పంటలు ఎండ తీవ్రతతో ఎండిపోతుండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులంతా కలిసి శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి శివలింగానికి జలాభిషేకం చేశారు. మహిళలు నీటి బిందెలతో ఆలయానికి చేరుకుని శివలింగం పూర్తిగా నీటితో నిండేలా అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ దేవాదాయ కమిటీ సభ్యులు మేకల చిన్న ఉషన్, తూముకుంట కుర్మయ్య, గొందిపర్ల శివుడు, వెంకటేశ్వర శెట్టి, మేకల బీరయ్య, బత్తుల నారాయణ, ఈశ్వరమ్మ, నాగయ్య చారి, సరస్వతి, జయలక్ష్మి, గోవిందమ్మ, లక్ష్మి, సునీత, చిట్టెమ్మ, శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ



**నారాయణపేట,జూలై 13(జనంసాక్షి):** ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం నారాయణ పేటలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీ ఆర్డీఓ కార్యాలయం నుండి జిల్లాపాత దవాఖాన వరకు కొనసాగింది. ఈ కార్య క్రమానికి ఉప జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. కె.సిద్ధప్ప ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచ జనాభా దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశ్యం జనాభా పెరుగుదల వల్ల ఏర్పడే సామాజిక, ఆర్థిక, ఆరోగ్య సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పించడం అని తెలిపారు. ప్రతి దంపతులు కుటుంబ నియంత్రణ పద్ధతులను అవలంబించి, ఆరోగ్యకరమైన చిన్న కుటుంబాన్ని ఏర్పరచుకోవాలని సూచించారు. డాక్టర్ సుధేష్ణ ప్రోగ్రామ్ అధికారి గారు మాట్లాడుతూ బిడ్డకు బిడ్డకు మధ్య ఎడం పాటించడం వలనఆరోగ్యకరమైన,నైపుణ్యతను కలిగిన బిడ్డను పెంపొందించడం జరుగుతుందని తెలిపారు. తల్లి-శిశు ఆరోగ్య పరిరక్షణ, కుటుంబ సంక్షేమ సేవలను ప్రభుత్వ ఆరోగ్య సంస్థల ద్వారా ఉచితంగా పొందవచ్చని తెలిపారు.ర్యాలీలో పాల్గొన్న వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఇతర ఆరోగ్య సిబ్బంది “పిల్లలకు సరైన అంతరం ఉంటే కుటుంబాలు ఆరోగ్యంగా నైపుణ్యంతో ఉంటాయి” చిన్న కుటుంబం సంతోషకరమైన కుటుంబం”, కుటుంబ నియంత్రణతో ఆరోగ్యకరమైన సమాజం”, “ప్రణాళికాబద్ధమైన కుటుంబమే అభివృద్ధికి పునాది” వంటి నినాదాలతో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డా సుధేష్ణ, డా. లక్ష్మీకాంత్, వైద్యదికారి డా తిరుపతి, కోఆర్డినేటర్లు అశోక్ కుమార్, విజయ్ కుమార్, అరవింద్ కుమార్ , సురేష్ , పి ఎచ్ ఎన్ జానకమ్మ, సూపర్‌వైజర్లు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ ఈ ర్యాలీతో పాటు నారాయణపేట పట్టణంలో జిల్లా ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మున్సిపల్ చైర్మన్ కొండ శ్వేత, వైస్ చైర్మన్ మంజుల ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై ఆల్బెండ జోల్ మాత్రలను పిల్లలకు వేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం ప్రారంబించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ కే సిద్ధప్ప. ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సాయిరాం డాక్టర్ లక్ష్మీకాంత్, డాక్టర్ సుధేష్ణ, డాక్టర్ సత్య ప్రకాష్, జిల్లా కోఆర్డినేటర్లు, ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నారు తుంచి నాటు వేయాలి

- వ్యవసాయ అధికారి రాంప్రసాద్



**టేక్మాల్, జులై 13 (జనంసాక్షి):**
టేక్మాల్ మండలంలోని బొడ్మట్‌పల్లిలో సోమవారం వరి నాటు విధానాన్ని వ్యవసాయ అధికారి రాంప్రసాద్ పరిశీలించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వరి నాటు వేయడానికి ముందు నారు కొనలను తప్పనిసరిగా తుంచి నాటాలని రైతులకు సూచించారు.నారు కొనలను తుంచడం వల్ల చీడపీడల ఉధృతి తగ్గి, పంట వేగంగా ఎదగడంతో పాటు రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుందని తెలిపారు. బోర్ల వద్ద అందుబాటులో ఉన్న నీటి పరిమాణాన్ని బట్టి మాత్రమే నాటు వేయాలని సూచించారు.అలాగే, పురుగుమందులను ఇష్టానుసారంగా కాకుండా వ్యవసాయ శాఖ సూచనల మేరకు, ఉదయం లేదా సాయంత్రం వేళల్లో మాత్రమే పిచికారీ చేయాలని చెప్పారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలను పాటిస్తూ పంటలను సాగు చేస్తే మెరుగైన దిగుబడులు సాధించవచ్చని రాంప్రసాద్ తెలిపారు.

## మమత హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత మెడికల్ క్యాంపు





**కౌడిపల్లి జూలై 13,(జనంసాక్షి):**
మెదక్ జిల్లా కౌడిపల్లి మండల కేంద్రంలో బిగ్ టీవీ ఆధ్వర్యంలో మమతా హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించిన మెగా ఉచిత హెల్త్ మెడికల్ క్యాంపు ఆదివారం విజయవంతంగా జరిగింది. గ్రామ సర్పంచ్, జిల్లా సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షుడు చంద్రం కృష్ణ గౌడ్ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.

ఈ శిబిరంలో సుమారు 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. బిపి,షుగర్, కంటి పరీక్షలు, ఈసీజీ తదితర వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. మరింత వైద్యం అవసరమైన వారికి వైద్యులు ప్రత్యేకంగా సూచనలు చేసి, ఉన్నత వైద్య సేవల కోసం రిఫర్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు జిల్లా ఉపాధ్యక్షులు చంద్రం కృష్ణ గౌడ్ మాట్లాడుతూ, ఉచిత వైద్య శిబిరాన్ని విజయవంతం చేసిన ప్రజలకు అభినందనలు తెలిపారు. మమతా హాస్పిటల్ సౌజన్యంతో, బిగ్ టీవీ ఆధ్వర్యంలో ప్రజలకు అవసరమైన వైద్య పరీక్షలు, మందులు అందించడం అభినందనీయమని అన్నారు. ఈ మెగా వైద్య శిబిరం విజయవంతం కావడానికి గత మూడు రోజులుగా స్వయంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు కౌడ శ్రీనివాస్ గుప్తా, ఉప సర్పంచ్ శ్వేతా మల్లికార్జున్ గౌడ్, వార్డు సభ్యులు దేవేందర్, మక్బూల్, రమేష్, లక్ష్మి, శరత్, మాధవి మహేష్, నాయకులు పుండరీకం గౌడ్, దర్జీ చంద్రం, పంచాయతీ సెక్రెటరీ నాగేష్, కరోబార్ ఎల్లం, గ్రామ పెద్దలు, నాయకులు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు పాల్గొన్నారు.

## తపస్ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన

- తపస్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రమేష్



**సంగారెడ్డి, జూలై 13(జనంసాక్షి):** తపస్ ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభిస్తుందని తపస్ రాష్ట్ర కార్యదర్శి రమేష్ పేర్కొన్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లా పటాన్చెరువు మండలంలోని వివిధ పాఠశాలల్లోని ఉపాధ్యాయులతో సభ్యత్వం నమోదు చేయించారు.

ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా తపస్ సభ్యత్వ నమోదుకు స్పందన లభిస్తుందన్నారు. సోమవారం పటాన్చెరు మండలంలోని ఇంద్రేశం పాఠశాలతో పాటు వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయుల చేత సభ్యత్వం నమోదు చేయడం జరిగిందన్నారు. తపస్ ఉపాధ్యాయ సంఘం ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తుందని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై ఈనెల 14 మంగళవారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు దశరథ్, ప్రధానోపా ధ్యాయులు మండల శాఖ అధ్యక్షులు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి వీరేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రక్రియలో.. వేగం పెంచాలి



**నిజాంపేట, జులై 13 (జనంసాక్షి):**
ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ ప్రక్రియలో.. వేగం పెంచాలని, గిర్ధవర్ ప్రీతి, ఆర్డీవో కార్యాలయ అధికారి సందీప్ సూచించారు. నిజాంపేట మండలం నగరంలో జరుగుతున్న ప్రక్రియను సోమవారం పరిశీలించారు. మండలంలో 44 శాతం ప్రక్రియ పూర్తయిందని, ప్రక్రియలో వేగం పెంచాలని బీఎల్వో స్వప్న కు సూచించారు. కార్యదర్శి ఆరిఫ్ ఉన్నారు.

## విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండండి

- యాంటీ డ్రగ్ సోల్జర్'లుగా విద్యార్థులు ముందుకు రావాలి
- 400 మంది విద్యార్థులతో పోలీసుల అవగాహన కార్యక్రమం



**వనపర్తి బ్యూరో, జులై 13 (జనంసాక్షి):** మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటమే ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు మార్గమని, ప్రతి విద్యార్థి “యాంటీ డ్రగ్ సోల్జర్”గా మారి సమాజంలో చైతన్యం తీసుకురావాలని వనపర్తి డీసీఆర్బీ డీఎస్పీ బాలాజీ నాయక్ పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ సునిత రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం వనపర్తి ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో మాదకద్రవ్యాల నిర్మూలన, విద్యార్థినుల భద్రత, మహిళల రక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, పతకాలు, ‘యాంటీ డ్రగ్ సోల్జర్’ సర్టిఫికెట్లను డీఎస్పీ బాలాజీ నాయక్, ఎస్సై అంజాద్, కళాశాల ప్రిన్సిపాల్ నవీన, వైస్ ప్రిన్సిపాల్ సంయుక్తంగా అందజేశారు. ప్రభుత్వం అందుబాటులో ఉంచిన 1908 టోల్‌ఫ్రీ సేవలను అవసరమైనప్పుడు వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొనగా, సుమారు 400 మంది విద్యార్థులు హాజరయ్యారు.

## డంప్ యార్డ్ గురించి స్థలం కేటాయింపుపై వినతి పత్రం

- గ్రామ సర్పంచ్ నాయిని వెంకట్ గౌడ్ (గజిని)



**కొల్చారం, జూలై 13(జనంసాక్షి):** కొల్చారం మండలంలోని అప్పజిపల్లి గ్రామానికి సంబంధించి డంప్ యార్డ్ ఏర్పాటు కోసం స్థలం కేటాయించాలని సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నాగేష్‌కు వినతి పత్రం అందజేశామని గ్రామ సర్పంచ్ నాయిని వెంకట్ గౌడ్ (గజిని) తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చలం నర్సింలు, వార్డు సభ్యులు సదాల నర్సింలు, కన్నీ బోయిన రామాంజం, మానేపల్లి సావిత్రి, కదూరి సుశీల పాల్గొన్నారు.

## వ్యక్తిగత పరిశుభ్రతతోనే అనేక రోగాలను నివారించవచ్చు

- కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు టి.సువర్ణ మల్లన్న పాటిల్



**కోహీర్, జులై 13 (జనంసాక్షి):** ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా అనేక రోగాలను నివారించవచ్చని కోహీర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ టి. సువర్ణ మల్లన్న పాటిల్ అన్నారు.
సోమవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా కోహీర్ మండలంలోని చింతల్‌గట్ ప్రాథమిక పాఠశాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చింతల్‌గట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఉదయ్ కుమార్ మాట్లాడుతూ, 1 సంవత్సరం నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసి వేయడం జరుగుతుందని, వాటి ద్వారా కడుపులోని నులిపురుగులు నిర్మూలించబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బంటు విద్యాసాగర్, ఉప సర్పంచ్ ఖలీల్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవి, పాల్గొన్నారు.

## నులి పురుగుల నిర్మూలనతోనే బాలల ఆరోగ్యం

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రమేష్



**కొల్చారం, జూలై 13 (జనంసాక్షి):** జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా సోమవారం కొల్చారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో 1-19 సంవత్సరాల వయసు గల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయడం జరిగిందని కొల్చారం పిహెచ్ సి డాక్టర్ రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కొల్చారం కేబీజీవి పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి రఫీక్ ఉన్నిసా బేగం, మండల విద్యాధికారి ఉమారాణి, కేజీబీవీ ప్రిన్సిపాల్ ధరణి, ఎం. పి. హెచ్. ఈ. ఓ. ఎస్. మదన్ మోహన్, సూపర్వైజర్లు మార్త, రమేష్, స్టాఫ్ నర్స్ మాజీదా, ఆశ కార్యకర్త కవిత తదితరులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియ వేగవంతం చేయండి

- అందోల్ ఆర్డీఓ రమేష్ బాబు



**అల్లాదుర్గం, జూలై 13(జనంసాక్షి):** కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సర్ సర్వేను వేగవంతం చేయాలని ఆందోల్ ఆర్డీఓ రమేష్ బాబు ఆదేశించారు. సోమవారం మండల పరిధిలోని అప్పాజీపల్లి గ్రామంలో సర్, సర్వేను తనిఖీ చేశారు. సందర్భంగా మాట్లాడుతూ ఎన్యుమరేషన్ పారాల డిజిటలైజేషన్ను అత్యంత ఖచ్చితత్వంతో వేగవంతం చేయాలని సూచించారు. ఓటర్ వివరాలు నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ప్రతి పారాన్ని నిషితంగా పరిశీలించి డిజిటలైజ్ చేయాలని కోరారు. గడువులోగా 100% ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ మల్లయ్య, సర్పంచ్ రవికుమార్ తదితరులున్నారు.

## బిఆర్ఎస్ హయాంలోని అభివృద్ధి

- ప్రస్తుత ప్రభుత్వంలో అవస్థలు పడుతున్న ప్రజలు
- బిఆర్ఎస్ యువజన నాయకుడు బోడ శ్రీకాంత్




**రామాయంపేట, జులై 13 (జనంసాక్షి):** మెదక్ జిల్లా రామాయంపేట బిఆర్ఎస్ ప్రభుత్వ హాయంలోని అన్ని రంగాల్లో అభివృద్ధి జరగటం పాటు ప్రజలు కూడా సుఖసంతోషాలతో ఉన్నారని బిఆర్ఎస్ యువజన నాయ కుడు, అక్కన్నపేట 9వ వార్డు సభ్యుడు బోడ శ్రీకాంత్(బబ్లు) అన్నారు.

సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో అవస్థలు పడ్డ ప్రజలకు ప్రత్యేక రాష్ట్ర ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజలు సుఖ సంతోషాలతో జీవించారని ఆయన గుర్తు చేశారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఇంటింటికి మిషన్ భగీరథ నీళ్లు, రైతులకు పంట పెట్టుబడి సాయం, రైతు బీమా, అందుబాటులో ఎరువులు, పేరేంటి ఆడపిల్లల పెళ్లి ఖర్చులకు కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్, నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, కుల వృత్తులకు ఉచితంగా గొర్రెలలు, చేపలు పంపిణీ, దళిత బంధు, సాగు నీటి సమస్యలు తలెత్తకుండా ప్రతిష్టాత్మకంగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేసి రాష్ట్రాన్ని శస్యశ్యామలం చేసిన ఘనత కేసిఆర్కే దక్కింది అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ఈ పథకాలను పూర్తిగా నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతుందని ఆరోపించారు. మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో గతంలో కెసిఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమలు కోసం తాము పోరాటాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

# లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

- నూతన అధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారిని ఘనంగా సన్మానించిన మంత్రి



**మక్తల్, జూలై 13 (జనంసాక్షి):** లయన్స్ క్లబ్ ఆఫ్ మక్తల్ భీమా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం పట్టం రవి కన్వెన్షన్ హాల్‌లో మాజీ అధ్యక్షుడు లయన్ ఎ.సత్యాంజనేయులు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ప్రోగ్రాం చైర్మన్ లయన్ జి. జయపాల్ రెడ్డి స్వాగత ప్రసంగంతో కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం లయన్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు లయన్ మెల్విన్ జోన్స్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి హాజరై మాట్లాడారు. సమాజంలో సేవ చేయాలనే తపన ఉన్నవారు చాలామంది ఉన్నప్పటికీ, సేవను స్వీకరించే వారు ఉన్నప్పుడే సేవా కార్యక్రమాలకు సార్థకత ఉంటుందని అన్నారు. లయన్స్ క్లబ్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను అభినందిస్తూ, లయన్స్ ఐ హాస్పిటల్ నిర్మాణానికి ప్రస్తుతం నిర్మిస్తున్న 100 పడకల ఆసుపత్రి సమీపంలో అర ఎకరం స్థలం కేటాయించేందుకు అంగీకారం తెలిపినట్లు వెల్లడించారు.

ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ ఎం. ప్రేమ్ కుమార్ నూతన అధ్యక్షుడిగా లయన్ టి. నాగరాజు, కార్యదర్శిగా లయన్ ఎస్. రమేష్ రావు, కోశాధికారిగా లయన్ బి.అంబాదాసు రావుతో పాటు కార్యవర్గ సభ్యులు, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు.

మక్తల్ లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ 320ఏలో సేవా కార్యక్రమాలతో ప్రత్యేక గుర్తింపు పొందిందని, అనేక అవార్డులు సాధించిందని పేర్కొంటూ, నూతన కమిటీ కూడా సేవా కార్యక్రమాలను మరింత విస్తరించి క్లబ్‌కు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

క్లబ్ ఎక్స్‌టెన్షన్ చైర్మన్, సేవారత్న లయన్ నటరాజ్ పీడీజీ వర్షాకాలంలో పేదల గుడిసెలు కారకుండా ఎంపిక చేసిన కుటుంబాలకు పంపిణీ చేయడానికి 15 తాడిపత్రిలను క్లబ్ సభ్యులకు అందజేశారు.

డాక్టర్స్ డే సందర్భంగా లయన్ డాక్టర్ పి.శ్రీరామ్, లయన్ డాక్టర్ అశోక్, లయన్ డాక్టర్ మణికంఠ గౌడ్‌లను శాలువాలతో సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేశారు. అలాగే నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధ్యక్షుడు,కార్యదర్శి, కోశాధికారిని మంత్రి శాలువాలతో ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా 2026-27 సంవత్సరానికి సంబంధించిన లయన్స్ఇంటర్నేషనల్ ఫీజు రూ. 2.50 లక్షల చెక్కును మంత్రి చేతుల మీదుగా ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్ ఎం.ప్రేమ్ కుమార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో వి.నరేందర్, డి. బసవరాజ్, బి. కొండయ్య, జి.శరణప్ప, ఎం.ఆర్. రామచంద్రప్ప, సిద్ధిలింగయ్య, సుజాత, అరుణ, జయశ్రీ, ఆడెం శ్రీనివాస్, కట్ట వెంకటేష్, పాపిరెడ్డి, డి.వి.చారి, ఎం. వాదిరాజ్, అంజన్ ప్రసాద్, ఆడెం సత్యనారాయణ, కోళ్ల వెంకటేష్, సుకన్య శేఖర్, కావలి తాయప్ప, తాన్సింగ్, భార్గవ్ రానా, కర్ణి స్వామి, రమేష్ కుమార్, కాకులారం అశోక్, వట్టం రతన్ కుమార్ గుప్తా పాల్గొన్నారు.

## విద్యార్థులకు నులిపురుగుల నివారణపై అవగాహన

- పేట వైద్యాధికారి షర్ఫుద్దీన్



**పెద్ద శంకరంపేట, జూలై 13 (జనంసాక్షి):** పెద్ద శంకరంపేటలో పిహెచ్‌సి ఆధ్వర్యంలో జాతీయ నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని పేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని పేట వైద్యాధికారి డాక్టర్ షర్ఫుద్దీన్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపాన్ని నివారించడంలో ఈ మాత్రలు కీలకపాత్ర పోషిస్తాయి అన్నారు. పిల్లల ఆరోగ్యానికి ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అర్హులైన ప్రతి విద్యార్థి ఈ మాత్రలు వేసుకునేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పేట విద్యాధికారి వేణు శేఖర్, ప్రిన్సిపాల్ శోభారాణి, హెచ్ఇఓ యాదయ్య, ఎంపీహెచ్ఎస్ యాదమ్మ, ఎం ఎల్ హెచ్ పి సునీల్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాళ్లకాల్ నత్తి మల్లేష్ ముదిరాజ్‌కు వాల్టాస్ మల్లేష్ గౌడ్ ప్రత్యేక అభినందనలు

- పార్టీ కోసం శ్రమించిన వారిని అధిష్టానం తప్పకుండా గుర్తిస్తుంది
- పార్టీ బలోపితానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలి





**మనోహరాబాద్ జూలై 14 (జనంసాక్షి):** భారతీయ జనతా పార్టీ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియామకమైన సందర్భంగా నత్తి మల్లేష్ ముదిరాజ్ మెదక్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు వాల్టాస్ మల్లేష్ గౌడ్‌ను నర్సాపూర్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి ఆశీస్సులు పొందారు.


ఈ సందర్భంగా వాల్టాస్ మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే కార్యకర్తలను భారతీయ జనతా పార్టీ ఎప్పటికప్పుడు గుర్తించి సముచిత బాధ్యతలు అప్పగిస్తుందని అన్నారు. కొత్త బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ సిద్దిపేట జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు.

పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, గ్రామ స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయడంతో పాటు కొత్త కార్యకర్తలను పార్టీలోకి తీసుకురావడానికి కృషి చేయాలని సూచించారు.

నత్తి మల్లేష్ ముదిరాజ్ మాట్లాడుతూ, పార్టీ అధిష్ఠానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పార్టీ అభివృద్ధి, కార్యకర్తల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు కె.నరేందర్ చారి, మనోహరాబాద్ మండల అధ్యక్షుడు బక్క వెంకటేష్ గౌడ్, బూత్ అధ్యక్షులు ఎర్ర శేఖర్, ఎల్. శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఐకేపీ, వివోఏల సమస్యలను పరిష్కరించాలి

- సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య



**జడ్చర్ల, జూలై 13 (జనంసాక్షి):** తెలంగాణ ఐకేపీ, వివోఏల సమస్యలను పరిష్కరించాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య ఆధ్వర్యంలో జడ్చర్లలో వినతిపత్రం అందజేశారు. సోమవారం స్థానిక ఏపీఎం కార్యాలయంలో ఏపీఎం మాధవికి వినతిపత్రం సమర్పించిన అనంతరం సత్తయ్య మాట్లాడుతూ, గత 25 ఏళ్లుగా వివోఏలు గ్రామస్థాయిలో మహిళా అభ్యున్నతికి, ప్రభుత్వ కార్యక్రమాల అమలులో కీలకపాత్ర పోషిస్తున్నారని గుర్తుచేశారు. ప్రభుత్వం నెలకు 18 వేల రూపాయల వేతనం ఇస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని, తమను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. సెర్ప్ సీఈవోతో జరిగిన చర్చల మేరకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలన్నారు. ప్రభుత్వం నుంచి నెలకు 18 వేల వేతనంతో పాటు 10 లక్షల రూపాయల ప్రమాద మరియు ఆరోగ్య బీమా కల్పించాలని, సెర్ప్ సర్క్యులర్ ప్రకారం గ్రామ సంఘాల ద్వారా వేతనాలు పెంచాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి గ్రామ సంఘానికి ట్యాబ్, ఇంటర్నెట్ సౌకర్యాలు కల్పించాలని, ఆదాయం లేని గ్రామ సంఘాలకు 20 లక్షల రూపాయల ప్రత్యేక నిధిని కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ వివోఏ జిల్లా అధ్యక్షురాలు వసియా బేగం, అలివేల, అమృత, కల్పన తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీకి గుడ్‌బై.. బీఆర్ఎస్‌లో చేరిన కే.గోవర్ధన్ రెడ్డి



**కోహిర్, జులై 13 (జనంసాక్షి):** హైదరాబాద్‌లో మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీష్ రావు, జహీరాబాద్ ఎమ్మెల్యే సమక్షంలో బీజేపీ నాయకుడు కే. గోవర్ధన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా హరీష్‌రావు ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కే.గోవర్ధన్ రెడ్డితో పాటు పలువురు అనుచరులు కూడా బీఆర్ఎస్‌లో చేరినట్లు కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు తెలిపారు.
ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీ ప్రజల కోసం పనిచేసే పార్టీ అని, తెలంగాణ అభివృద్ధే పార్టీ లక్ష్యమని అన్నారు. కే. గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్‌లో చేరినట్లు తెలిపారు. పార్టీలో తనకు అప్పగించే బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తానని చెప్పారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొని కే.గోవర్ధన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

## 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు ఓపీఎస్ అమలు చేయాలి : తపస్



**సంగారెడ్డి, జూలై 13 (జనంసాక్షి):** 2003 డీఎస్సీ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలు చేసి, సీపీఎస్‌ను రద్దు చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర కార్యదర్శి ఎస్. రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
సోమవారం ఆయన మాట్లాడుతూ, 317 జీవో కారణంగా అనేక మంది ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఆదర్శ పాఠశాలలు, గురుకులాలు, కస్తూర్బా పాఠశాలల ఉద్యోగుల సమస్యలు కూడా పరిష్కారం కాకపోవడంతో పాటు, ఆరు డీఏలు పెండింగ్‌లో ఉండటంతో ఉద్యోగులకు ఆర్థిక నష్టం జరుగుతోందని పేర్కొన్నారు. పీఆర్సీ ప్రకటించకపోవడంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని, పదవీ విరమణ పొందిన వారికి రావాల్సిన బకాయిల కోసం కోర్టులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం తపస్ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణ చేపట్టిందని తెలిపారు. ఇప్పటికే తొలి దశలో తహసీల్దార్ల ద్వారా ముఖ్యమంత్రికి వినతిపత్రాలు అందజేసినట్లు, రెండో దశలో జూలై 14న సంగారెడ్డి కలెక్టరేట్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టరేట్ల ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## మక్తల్ కాంగ్రెస్ సభ విజయవంతం పట్ల హర్షం



**కృష్ణ, జులై 13 (జనంసాక్షి):** రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి కృషితో, మక్తల్-నారాయణపేట, హిందూపూర్-కృష్ణా రహదారుల సుమారు రూ. 237 కోట్ల రోడ్ల పనుల పైలాన్ ప్రారంభోత్సవం సందర్భంగా విచ్చేసిన గౌరవ రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ,ఎక్సైజ్, పర్యాటక శాఖ మాత్యులు జూపల్లి కృష్ణ రావు నిర్వహించిన బహిరంగ సభ విజయవంతం కావడం పట్ల కృష్ణ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాజప్ప గౌడ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.ఈ సభకు కృష్ణ మండలం నుండి పెద్ద ఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.మీ అందరి సహకారం, పార్టీ పట్ల మీ అంకితభావం మరింత ఉత్సాహాన్ని ఇచ్చిందన్నారు. ఇలాగే ప్రజా సేవలో కలిసి ముందుకు సాగుదమన్నారు.

## విద్యార్థినులకు నాణ్యమైన ఆహారం అందించాలి

• **జిల్లా మైనారిటీ అధికారి రషీద్**



**మక్తల్, జులై 13 (జనంసాక్షి):** విద్యార్థినులకు నాణ్యమైన ఆహారం అందివ్వాలని జిల్లా మైనారిటీ అధికారి రషీద్ అన్నారు. సోమవారం తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ బాలికల, పాఠశాల కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాజరు రిజిస్టర్ ఉపాధ్యాయుల విద్యార్థినుల హాజరు గురించి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత బియ్యం నాణ్యత తదితర వాటిపై చర్చించారు. ప్రతిరోజు భోజనం నాణ్యతను పరిశీలించి విద్యార్థినులకు అందజేయాలని మైనారిటీ అధికారి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎలిజబెత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నులిపురుగుల నివారణ మాత్రలు తప్పనిసరిగా వేయించాలి

• **సుభాష్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం**



**కల్వకుర్తి,జూలై 13,(జనంసాక్షి):** పిల్లల్లో రక్తహీనత,పోషకాహార లోపం,నులిపురుగుల సమస్యలను నివారించేందుకు చేపట్టిన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కల్వకుర్తి పట్టణంలోని సుభాష్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగాఒకటి నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసివేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ అలివేలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది, తల్లిదండ్రులు, చిన్నారులు పాల్గొన్నారు.

## హైందవ జిల్లా మాజీ అధ్యక్షురాలు అరుణ వర్ధంతి

• **ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతి**



**మిడ్జిల్, జులై 13 (జనంసాక్షి):** హైందవ జిల్లా మాజీ అధ్యక్షురాలు అరుణ వర్ధంతి సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులకు ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు పారితోషకాలను అందజేశారు. ఇంటర్ విద్యార్థులకు పదివేల రూపాయలు చొప్పున పదవ తరగతి విద్యార్థులకు 5000 రూపాయల చొప్పున నగదు బహుమతులను సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ రాములు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నగదు బహుమతులను అందజేశారు ఈ కార్యక్రమంలో హైందవ అధ్యక్షురాలు భర్త ఏ రాములు. రేణుక. కుమారుడు సృజన్ చక్రవర్తి. కూతురు సుదుప్తి. కోడలు రసజ్ఞ. సిపిఎం జిల్లా నాయకులు మండల నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు

## సంక్షేమ హాస్టళ్ల సమస్యలు పరిష్కరించండి

• **ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శ్రీనాథ్**



**జడ్చర్ల, జూలై 13 (జనంసాక్షి):** ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న మౌలిక సమస్యలపై ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శ్రీనాథ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం రాత్రి జడ్చర్లలోని ప్రభుత్వ హాస్టల్‌ను పరిశీలించి మాట్లాడుతూ హాస్టళ్లలో మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని, అపరిశుభ్రమైన వాతావరణం వల్ల విద్యార్థులు అనారోగ్యాల బారిన పడుతున్నారని తెలిపారు. త్రాగునీటి కొరత, విద్యుత్ అంతరాయాలు, శిథిలావస్థలో ఉన్న భవనాలు విద్యార్థులకు శాపంగా మారాయని పేర్కొన్నారు. నోట్ పుస్తకాలు, దుప్పట్లు, యూనిఫాంలు వంటి కనీస అవసరాలను కూడా ప్రభుత్వం సకాలంలో అందించడం లేదని విమర్శించారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఉప ముఖ్యమంత్రి రాక

**మల్దకల్, జూలై 13(జనంసాక్షి):** మండల పరిధిలోని కుర్తి రావులచెరువు గ్రామానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి విద్యుత్తు శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క మంగళవారం అలంపూర్,గద్వాల నియోజకవర్గం లోపర్యటిస్తారు. కుర్తి రావులచెరువ గ్రామ సమీపంలోని 33/ 11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ ను ప్రారంభిస్తారు. మంగళవారం మధ్యాహ్నం రెండు గంటలకు గ్రామానికి చేరుకొని ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్కతో పాటు మంత్రులు జూపల్లి కృష్ణారావు,వాకిటి శ్రీహరి పాల్గొంటారు. భోజనం అనంతరం 8 వేల మందితో ప్రజలతో ముఖాముఖి మాట్లాడుతారు. ఆరిగిద్ద, తుమ్మల చెరువు, సోంపురం, పెదపాడు, ఉలిగేపల్లి సబ్‌స్టేషన్‌లను ప్రారంభిస్తారు. అనంతరం రైతులకు విద్యుత్తు ట్రాన్స్ఫారాలను పంపిణీ చేస్తారు. అక్కడనుండి గద్వాలలో కలెక్టరేట్ చేరుకొని హెలికాప్టర్లో హైదరాబాద్ కు వెళ్తారు.

## ఆల్బెండాజోల్ మాత్రల పంపిణీ



**మల్దకల్, జూలై 13(జనంసాక్షి):** మండల కేంద్రంలోని పి.ఎం.శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా సోమవారం గ్రామ సర్పంచ్ చిట్టెమ్మ హాజరై విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రలను పంపిణీ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండల విద్యాధికారి జి.సురేష్,గ్రామ పెద్దలు గోపాల్,హెల్త్ సూపర్వైజర్ శ్రీధర్, హెల్త్ అసిస్టెంట్ దేవన్న, ల్యాబ్ టెక్నీషియన్ రామస్వామి, ఏఎన్ఎం పుష్ప, ఆశా కార్యకర్తలు బి.నర్సమ్మ, పరిమళ పాల్గొన్నారు. ఈ సందర్భంగామండల విద్యాశాఖాధికారి సురేష్ మాట్లాడుతూ, ఆల్బెండాజోల్ మాత్రలు తీసుకోవడం వల్ల పేగు పురుగుల నివారణ జరిగి విద్యార్థుల ఆరోగ్యం, ఎదుగుదల మెరుగుపడుతుందని తెలిపారు.పరిశుభ్రత పాటించడం,ఆరోగ్యకరమైన అలవాట్లు అలవరచుకోవడం ద్వారా వ్యాధులను నివారించవచ్చని విద్యార్థులకు సూచించారు.ఈ సందర్భంగా దాదాపు 550 మంది విద్యార్థులకు ఆల్బండాజోల్ మాత్రలను వేయడంజరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆశాకార్యకర్తలు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉలిగేపల్లి హత్య కేసును ఛేదించిన పోలీసులు.. నిందితుడి అరెస్ట్

**మల్దకల్ జులై 13(జనంసాక్షి):** మల్దకల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల జరిగిన మహేష్ అనే యువకుడి దారుణ హత్య కేసును గద్వాల సర్కిల్ పోలీసులు ఛేదించారు.ఈ మేరకు గద్వాల సర్కిల్ ఇన్స్పెక్టర్ టంగుటూరి శ్రీను వివరాలను వెల్లడించారు.మల్దకల్ మండలం నేతోవానిపల్లి గ్రామానికి చెందిన బోయ వీరేష్ (23) చెల్లెలు లలిత, ఉలిగేపల్లి గ్రామానికి చెందిన మహేష్ మృతుడుగత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. అయితే మహేష్‌కు ఎలాంటి ఉద్యోగం లేకపోవడంతో లలిత కుటుంబ సభ్యులకు ఈ పెళ్లి ఇష్టం లేదు.లలితకు వేరే సంబంధాలు చూస్తున్నప్పటికీ, మహేష్ కారణంగా అవి క్యాన్సిల్ అవుతున్నాయని వీరేష్ భావించాడు.గతంలో పెద్దక్క కూడా ప్రేమ వివాహం చేసుకోవడం, ఇప్పుడు చిన్న చెల్లెలు కూడా మహేష్‌తో వెళ్లిపోతే పరువు పోతుందని భావించిన వీరేష్,మహేష్‌ను హతమార్చాలని నిర్ణయించుకున్నాడు.

**హత్య జరిగిన తీరు...**

ఈ నెల 9 తేదీన తెల్లవారుజామున సుమారు 4గంటల సమయంలో, వీరేష్ గొడ్డలితో మహేష్ వ్యవసాయ పొలం వద్ద ఉన్న పశువుల కొట్టానికి వెళ్లాడు.అక్కడ మంచంపై పడుకొని ఉన్న మహేష్ తలపై గొడ్డలితో దారుణంగా నరికి చంపాడు.అనంతరం నిందితుడు రక్తం అంటిన బట్టలను,గొడ్డలిని ర్యాలంపాడు డ్యామ్‌లో పడవేసి,ఏమీ తెలియనట్టు తిరగసాగాడు.సోమవారం మధ్యాహ్నం 12:00 గంటల సమయంలో గద్వాల పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో గల మేళచెరువు రోడ్డు చౌరస్తా వద్ద పోలీసులు నిందితుడైన బోయ వీరేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు తన నేరాన్ని అంగీకరించాడు. నిందితుడి వద్ద నుండి హత్యకు ఉపయోగించిన గొడ్డలిని వివరాలు ఉన్న రెండు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసును చాకచక్యంగా దర్యాప్తు చేసి నిందితుడిని పట్టుకున్న గద్వాల సర్కిల్ ఇన్స్పెక్టర్ టంగుటూరి శీను మల్దకల్ పోలీసు సిబ్బందిని జిల్లా ఉన్నతాధికారులు అభినందించారు.

# పిల్లల మధ్య సరైన ఎడం.. ఆరోగ్యకరమైన కుటుంబానికి బాట

- **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

**మెదక్ బ్యూరో చీఫ్, జూలై 13 (జనంసాక్షి):** "పిల్లల మధ్య సరైన ఎడం – ఆరోగ్యకరమైన కుటుంబానికి ఆధారం" అనే సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. అర్హులైన దంపతులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న ఉచిత కుటుంబ నియంత్రణ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని జూలై 11 నుంచి 18 వరకు నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మెదక్‌లోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో శాశ్వత, తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులు (ట్యూబెక్టమీ, వాసెక్టమీ, గర్భనిరోధక మాత్రలు తదితర స్పేసింగ్ మెథడ్స్) వినియోగిస్తున్న దంపతులను శాలువాలతో సత్కరించి అభినందించారు.



పిల్లల మధ్య సరైన ఎడం పాటించడం వల్ల తల్లి, శిశువు ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు కుటుంబం ఆరోగ్యవంతంగా, సంతోషంగా ఉంటుందని కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు. కుటుంబ నియంత్రణ పద్ధతులపై అపోహలు వీడి, ప్రభుత్వ వైద్య సంస్థల్లో ఉచితంగా అందిస్తున్న సేవలను ప్రజలు వినియోగించుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.గణేశ్వర్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా.జయశ్రీ, మాస్ మీడియా అధికారి అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

# పోస్టుల మంజూరే లేదు... ప్రభుత్వ విద్య బలోపేతం ఎలా సాధ్యం

- **సి.పి.ఎం. బృందం ఆవేదన..**



**అమరచింత, జులై 13(జనంసాక్షి):** మండల పరిధిలోని మస్తిపురం ప్రభుత్వ హైస్కూల్‌ను సి.పి.ఎం. బృందం సోమవారం నాడు సందర్శించి పలు సమస్యలను వెలుగులోనికి తేవడం జరిగిందిఈ సందర్భంగా సి. పి.ఎం. మండల కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.అజయ్ మాట్లాడుతు. 101మంది విద్యార్థులకు గాను ఆరుగురు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారని. హిందీ గణితము పీఈటి పోస్టులు ఖాళీగా ఉండడంతో విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. పదిలో 100% ఉత్తీర్ణత సాధించాలని ప్రభుత్వ లక్ష్యం ఏ విధంగా నెరవేరుతుంది అని సిపిఎం బృందం విమర్శించింది. 12 కంప్యూటర్లు ఉన్న శిక్షణ ఇచ్చే ఉపాధ్యాయులు లేకపోవడంతో కంప్యూటర్ విద్యకు విద్యార్థులు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేరుకే ల్యాబ్ ఉన్న ప్రాక్టికల్‌కు సరిపడా మెటీరియల్ లేదని విమర్శించారు. ప్రభుత్వ స్కూళ్లలో వెంటనే బ్రేక్ ఫాస్ట్ స్కీం ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఖాళీగా ఉన్న పోస్టులకు ప్రత్యేకంగా వెంటనే విద్యా వాలంటీర్లను నియమించాలని డిమాండ్ చేశారు. హిందీ గణితం పి ఈ టి . హెడ్ మాస్టర్. మరియు కంప్యూటర్ శిక్షణకు ల్యాబ్ నిర్వహణకు పోస్టులు మంజూరు చేయాలని కోరారు. అర కోర వసతులతో ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యను అందించడం ఏ విధంగా సాధ్యమవుతుందని. విమర్శించారు.ప్రభుత్వ స్కూళ్లకు వెంటనే స్టూడెంట్ కిట్లను అందించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ స్కూళ్లలో నర్సరీ నుండి కంప్యూటర్ శిక్షణ ఇస్తున్న ప్రభుత్వ స్కూళ్లలో మాత్రం 10 విద్యార్థులకు కూడా కంప్యూటర్ శిక్షణ లేని దీనస్థితిలో ఉన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్లో విద్యకు రాష్ట్ర ప్రభుత్వం 30%శాతం కేంద్రశీ 10% నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.ఈ సర్వే కార్యక్రమంలో తిరుమల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## గిర్మాపూర్ టీజీ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలను సందర్శించిన అధికారులు



**కొండాపూర్, జూలై 13 (జనంసాక్షి):** మండల పరిధిలోని టీజీ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ కాలేజ్ (బాలుర)ను సోమవారం ఎమ్మార్వో, ఎంపీడీవో, ఎంఈఓ సంయుక్తంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని బాత్రూములు, వంటశాల, కూరగాయల నాణ్యత, ఆహార పదార్థాలు, భోజన తయారీ విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు వడ్డించిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజనం నాణ్యత, పరిశుభ్రత, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై అధికారులకు సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. విద్యార్థుల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో రెసిడెన్షియల్ ప్రిన్సిపల్ సుధాకర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## మల్టీపర్పస్ కార్మికులకు రూ.15 లక్షల ప్రమాద బీమా

**కొల్చారం, జూలై 13(జనంసాక్షి):** కొల్చారం మండలంలోని పోతంశెట్టిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో పనిచేస్తున్న మల్టీ పర్పస్ కార్మికులకు రూ.15 లక్షల ప్రమాద బీమా (ఇన్సూరెన్స్) చేయించడం జరిగిందని గ్రామ సర్పంచ్ పాతూరి దయాకర్ గౌడ్ తెలిపారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ అభివృద్ధికి కార్మికులు అందిస్తున్న సేవలు ఎంతో విలువైనవి, వారి కుటుంబాలకు భరోసాగా ఈ ప్రమాద బీమా ఉపయోగపడుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుండు నాని, గ్రామ కార్యదర్శి పోశయ్య, వార్డు సభ్యులు సాయిని రాజు, చిట్యాల రవి, చాకలి అశోక్, నాయి కోటి మహిపాల్, సగినాల దీవెన తదితరులు పాల్గొన్నారు.

## ఆర్.ఎం.పి డాక్టర్ పై చర్యలు తీసుకోవాలి



**కొల్చారం, జూలై 13(జనంసాక్షి):** ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఆర్ఎంపీ డాక్టర్ రాజుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితురాలి తండ్రి కుసంగి దుర్గయ్య జిల్లా వైద్యాధికారి జ్ఞానేశ్వర్, కొల్చారం ఎస్ఐ మహమ్మద్ మోహీనుద్దీన్‌లకు ఫిర్యాదు చేశారు. కొల్చారం మండలంలోని రంగంపేట గ్రామంలో ప్రైవేట్ హాస్పిటల్ పై కొల్చారం మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు పైతర గ్రామ సర్పంచ్ యాబన్నగారి రవితేజ రెడ్డి తో పాటు పంచాయతీ పాలకవర్గం గ్రామ పెద్దలు ఆర్ఎంపి వైద్యుని నిర్లక్ష్యంతో ప్రజల ప్రాణాలు కోల్పోతున్నారని ఆరోపించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల రెండవ తేదీన తమ కూతురు కు జ్వరం రావడంతో రంగంపేటలోని మీనా ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స చేయించినట్లు తెలిపారు.శరీరంలో దద్దుర్లు మరింత తీవ్రమయ్యాయని ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వగా కూడా అదే సమాచారం ఇచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పరిస్థితి విషమించడంతో వెంటనే హైదరాబాదులోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించి చికిత్స కోసం చేర్పించినట్లు తెలిపారు. ప్రస్తుతం కూడా ఆరోగ్యం పరిస్థితి ఆందోళనకరంగా ఉందన్నారు. నిర్లక్ష్యంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కుటుంబానికి న్యాయం చేయాలని బాధితురాలి తండ్రి అధికారులను కోరారు.

## కంది సెంట్రల్ జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆకస్మిక తనిఖీ




**సంగారెడ్డి, జూలై 13 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కంది సెంట్రల్ జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూచనల మేరకు ఈ తనిఖీ నిర్వహించారు.

తనిఖీలో భాగంగా జైలులోని బ్యారక్‌లు, ఖైదీల గదులు, వంటశాల, ఆహార నిల్వ గదులు, జైలు ఆవరణతో పాటు ఇతర సౌకర్యాలను ఆమె పరిశీలించారు. ఖైదీలతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వసతులు, భోజన నాణ్యత, వైద్య సేవలు తదితర అంశాలపై ఆరా తీశారు. ఖైదీల అవసరాలకు అనుగుణంగా అన్ని సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని జైలు అధికారులకు సూచించారు.

ఖైదీలకు బెయిల్, ములాఖత్ వంటి సదుపాయాలు సకాలంలో అందుతున్నాయా అనే విషయాన్ని తెలుసుకుని, కేసుల పరిష్కారానికి అవసరమైన ఉచిత న్యాయ సహాయాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందిస్తామని వారికి వివరించారు. అలాగే ఖైదీలకు అందిస్తున్న భోజనాన్ని స్వయంగా రుచి చూసి, వంటశాల పరిశుభ్రత, కూరగాయలు, బియ్యం తదితర ఆహార పదార్థాల నిల్వలను తనిఖీ చేశారు. జైలులోని లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను కూడా పరిశీలించి, ఖైదీలకు న్యాయ సేవలు సమర్థవంతంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి బి. సౌజన్యతో పాటు జైలు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమ హామీలను వెంటనే అమలు చేయాలి: టిడబ్ల్యూజేఎఫ్




**నాగర్‌కర్నూల్, జూలై 13 (జనంసాక్షి):** జర్నలిస్టులకు ఇచ్చిన సంక్షేమ హామీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) నాగర్‌కర్నూల్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం అంబేద్కర్ చౌరస్తాలో నిరసన చేపట్టి, అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, జర్నలిస్టులు ప్రజలు--ప్రభుత్వం మధ్య వారధిగా పనిచేస్తున్నప్పటికీ వారి సంక్షేమం పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యం చూపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయడంతో పాటు, రాష్ట్ర, జిల్లా అక్రిడిటేషన్ కమిటీల్లో అన్ని జర్నలిస్టు సంఘాలకు సమాన ప్రాతినిథ్యం కల్పించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో హెల్త్ కార్డులు, రూ.10 లక్షల ఆరోగ్య బీమా, ముఖ్యమంత్రి హామీ మేరకు ఇళ్ల స్థలాలు, గృహాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. మహిళా జర్నలిస్టులకు రాత్రి వేళల్లో ఉచిత రవాణా, జర్నలిస్టులకు ఉచిత ఆర్టీసీ, మెట్రో, రైల్వే పాసులు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అలాగే చిన్న పత్రికల జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు జారీ చేసి, మీడియా స్వేచ్ఛ పరిరక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ కృష్ణ, జిల్లా అధ్యక్షుడు ఏ. పరిపూర్ణం, ప్రధాన కార్యదర్శి పి. వెంకటస్వామితో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్క ఓటు అత్యంత కీలకం



**చేర్యాల, జూలై 13 (జనంసాక్షి):** రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న సర్ ప్రక్రియలో భాగంగా జనగామ నియోజకవర్గ ఇంచార్జి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం రోజు చేర్యాల మండలం గుర్జకుంట, అకునూర్ , కషేగుడిసెలు , రాంపూర్ గ్రామాలలోని 30,31,32,33,34,35,51, 52వ బూత్ లలో గ్రామంలో సర్ పై ప్రజల కు అవగాహన కల్పించే కార్యక్రమంములో చేర్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంజే మల్లేశం ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. గ్రామంలో ప్రతి ఒక్క ఓటు ముఖ్యమైనది ఎవరు ఓటు హక్కును కోల్పోకుండా అందరూ సర్ ఫామ్ లను జాగ్రత్తగా స్థానిక బిఎల్ఎ, బిఎల్ఓల సహకారంతో పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఆగంరెడ్డి, అకునూర్ సర్పంచ్ కొమ్ము రవి, చేర్యాల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు దాసరి శ్రీకాంత్, జిల్లా స్పోక్ పర్సన్ కాటం సంజీవయ్య, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి అందే నాని బాబు, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు భూమని బాలరాజ్, ఉపసర్పంచ్ కడారి పల్లవి భాస్కర్, సర్పంచ్ శెట్టే కొమురయ్య, బాలనర్స్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ప్రజావాణిలో బీఎస్పీ వినతులు.. ఓటరు జాబితా గడువు పొడిగించాలని విజ్ఞప్తి

**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, జులై 13(జనంసాక్షి):** జిల్లా ప్రజావాణి కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) ఆధ్వర్యంలో వివిధ ప్రజా సమస్యలపై జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పృథ్వీరాజ్ మాట్లాడుతూ, ఓటరు జాబితా సవరణకు దరఖాస్తుల గడువు ఈ నెల 24తో ముగియనున్నందున దానిని పొడిగించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు కలెక్టర్ ద్వారా విజ్ఞప్తి చేశారు. జిల్లాలో నిరక్షరాస్యుల సంఖ్య అధికంగా ఉండటం, 2002 ఓటర్ల జాబితా ప్రజలకు అందుబాటులో లేకపోవడం, వలస కూలీలు ఎక్కువగా ఉండటం, ఉద్యోగులపై పనిభారం అధికంగా ఉండటం వల్ల



అనేక మంది గడువులోపు దరఖాస్తులు సమర్పించ లేకపోతున్నారని పేర్కొన్నారు. గడువు పొడిగించక పోతే అర్హులైన పౌరులు ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. నాగర్‌కర్నూల్ మెయిన్ రోడ్డులోని టీఎన్జీఓ భవనం పక్కన ప్రభుత్వ ఖాళీ స్థలంలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, వెంటనే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే 108 అంబులెన్స్ సిబ్బందికి గతంలో ఉన్న గది సౌకర్యాన్ని తిరిగి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అమ్రాబాద్ ఆశ్రమ పాఠశాలలో ఇటీవల జరిగిన ఫుడ్ పాయిజనింగ్ ఘటనను ప్రస్తావిస్తూ, ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించాలని కోరారు. కెజిబివిల్లో పదేళ్లకు పైగా కొనసాగుతున్న ఎస్ఓలు, సిబ్బందికి జిల్లా లేదా డివిజన్ స్థాయిలో బదిలీలు చేపట్టాలని కూడా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ పార్లమెంట్ ఇన్‌చార్జి సి. కళ్యాణ్, జిల్లా కార్యదర్శి బి. దాస్‌తో పాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## తూప్రాన్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం



**తూప్రాన్, జూలై 13 (జనంసాక్షి):** తూప్రాన్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇస్లాంపూర్ లంబాడీ తాండలోని గణపతి టెక్స్‌టైల్ యజమాని శివరామ్ గోశాలలో సోమవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. లయన్ డాక్టర్ లింగమూర్తి సహకారంతో జరిగిన ఈ శిబిరంలో ఆవులు, లేగదూడలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు.
సుమారు రూ.25 వేల విలువైన మందులను పంపిణీ చేసి, నట్టల నివారణ, ఎముకల దృఢత్వం, పాల ఉత్పత్తి పెంపు, చర్మవ్యాధులు, ఉబ్బరం, అజీర్తి తదితర సమస్యలకు చికిత్స అందించారు. ప్రతి పశువును పరిశీలించి ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా మందులు అందించారు. ఈ సందర్భంగా లయన్ డాక్టర్ లింగమూర్తి మాట్లాడుతూ, పశుసంపద రైతు కుటుంబాలకు ప్రధాన ఆర్థిక ఆధారమని, పశువుల ఆరోగ్య పరిరక్షణ ద్వారా పాల ఉత్పత్తి పెరిగి రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని అన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ జానకిరామ్ సీఆర్ మాట్లాడుతూ విద్య, వైద్యం, పర్యావరణంతో పాటు పశుసంరక్షణ రంగంలోనూ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు.
కార్యక్రమంలో లయన్ దేవత సాయికిరణ్ గుప్త, కొక్కొండ చంద్రశేఖర్ రెడ్డి, చేగుంట లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రామచంద్రం, రాజు నాయక్, గోశాల యజమాని శివరామ్, లయన్స్ సభ్యులు, గ్రామస్తులు, పశుపోషకులు పాల్గొన్నారు.

## ప్రమాదం పొంచి ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను సురక్షిత ప్రాంతానికి తరలింపు



**తెలకపల్లి, జూలై 13, (జనంసాక్షి):** మండల కేంద్రంలోని 13వ వార్డు శ్రీశైలం రోడ్డులోని శ్రీనివాస కాలనీ, కేకే రెడ్డి పాఠశాల సమీపంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం స్థానచలనం చేశారు. కేకే రెడ్డి పాఠశాల విద్యార్థులు, శ్రీనివాస కాలనీ వాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, సర్పంచ్ కొమ్ము శేఖర్, ఉప సర్పంచ్ మేర శ్రీను, 13వ వార్డు సభ్యుడు సొంటె మల్లేష్ సూచన మేరకు ఈ చర్యలు చేపట్టారు. తెలకపల్లి విద్యుత్‌శాఖ ఏఈ శాంతన్ తేజ ఆధ్వర్యంలో లైన్‌మెన్ లింగం నాయక్, సుదర్శన్ సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్‌ను సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కొమ్ము ప్రవళిక ఆనంద్, బారిగారి భాగ్యలక్ష్మి-లక్ష్మణ్ పాల్గొన్నారు.

## చేర్యాల ప్రాంత అస్తిత్వం కోసం ఎన్ని కేసులైన బరిస్తాం : ఉద్యమకారులు



**చేర్యాల, జూలై 13(జనంసాక్షి) :** చేర్యాల ప్రాంత అస్తిత్వం కోసం ఎన్ని కేసులైన బరిస్తాం అని ఉద్యమకారులు తెలిపారు. చేర్యాల ప్రజల ఆస్తి చెరువు మత్తడి స్థలంను (పశువుల అంగడి) మాజీ ఎంఎల్ఏ ముత్తిరెడ్డి కబ్జా పెడితే దానిని రక్షించుకోవడం కోసం ఆనాడు చేసిన ఉద్యమంలో ముత్తిరెడ్డి పెట్టించిన అక్రమ కేసుకు సంబంధించిన కోర్ట్ పేషికి ఉద్యమకారులు సోమవారం చేర్యాల కోర్టులో హాజరయ్యారు. ఏ ప్రాంతంలో మాజీ ఎమ్మెల్యే చేసిన అనేక అక్రమాలకు ఎందరో అమాయకులు బలయ్యారని, అందులో ఎందరో నిరుపేదలు ఇప్పటికి కేసులు చుట్టూ తిరుగుతూ విలువైన సమయాన్ని ఆర్థికంగా ఎంతో నష్టపోతున్నారని ఇప్పటికైనా ప్రభుత్వం అక్రమ కేసులను గుర్తించి ఉద్యమకారులను, అమాయకులను కేసుల నుండి విముక్తి చేయాలని డిమాండ్ చేశారు.

## ఇందిరమ్మ ఇళ్లతో పేదల ఇంటి కలకు పునాది..

- ఆనందోత్సవాలలో లబ్ధిదారులు
- గ్రామ శాఖ అధ్యక్షుడు అమరాజు ప్రశాంత్



**బెజ్జంకి, జూలై 13, (జనంసాక్షి):** మండలంలోని గుండారం గ్రామంలో ఇందిరమ్మ ఇంటి పథకం కింద లబ్ధిదారురాలు ఎల్కంటి పద్మ నూతన గృహ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడు అమర్ రాజు ప్రశాంత్, గ్రామ పెద్దలు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. లబ్ధిదారులు మాట్లాడుతూ తమ సొంతింటి కలను నెరవేర్చిన ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ ఎంపీపీ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్‌లకు కృతజ్ఞతలు తెలుపుతున్నాము అనీ అన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, కోరుకొప్పుల సంపత్, కోని అచ్చయ్య, ప్రధాన కార్యదర్శి పరకాల పర్శి, పుల్ల పోచయ్య, నాంపల్లి అమర్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినులకు చట్టాలపై అవగాహన

- 1098 టోల్‌ఫ్రీ నంబర్‌ను గుర్తుంచుకోవాలని సూచన




**గోపాలపేట, జూలై 13 (జనంసాక్షి):** జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ డి. కృష్ణయ్య మాట్లాడుతూ, విద్యార్థినులు సమాజంలో ఎదురయ్యే వేధింపులు, సమస్యలపై మౌనంగా ఉండకుండా వెంటనే స్పందించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 1098 బాలల సహాయ టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని వివరించారు. వివిధ చట్టాల ద్వారా విద్యార్థులకు కల్పించిన హక్కులు, ఉచిత న్యాయ సహాయం పొందే విధానం, చట్టాలను సద్వినియోగం చేసుకునే మార్గాలపై అవగాహన కల్పించారు. లీగల్ కౌన్సిల్ శ్రీమతి శ్రీదేవి కూడా విద్యార్థినులతో చర్చించి చట్టాలపై అవగాహన కలిగి ఉండటం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు వీరమణి, ఉపాధ్యాయులు చెన్న పద్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.

## వేతనం ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్న శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్..

**అచ్చంపేట, జులై 13 (జనంసాక్షి):** పట్టణంలోని కార్పొరేట్ పాఠశాలలో పనిచేసిన వేతనం ఇవ్వడం లేదని ఓ టీచర్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో పట్టణానికి చెందిన రూబీనా బేగం సోషల్ టీచర్‌గా 9ఏళ్లుగా పని చేసింది. వ్యక్తి గత కారణాలతో 4నెలలుగా బంద్ చేసింది. రాత పూర్వకంగా రాజీనామా చేసింది. పెండింగ్ లో ఉన్న ఒక నెల గౌరవ వేతనం రూ.20వేలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని ఆమె ఆరోపిస్తున్నారు. 4 నెలలుగా జీతం కోసం పాఠశాల చుట్టూ తిరుగుతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ రమేష్ కావాలని నిర్లక్ష్యం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో అవస్థలు పడుతున్నాము అని నా గౌరవ వేతనం వెంటనే ఇప్పించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## జంగంరెడ్డి పల్లిలో హైమాక్స్ లైట్ స్థాపనకు భూమిపూజ చేసిన బీజేపీ నాయకులు



**నర్వ, 13 జులై (జనంసాక్షి):** నర్వ మండలం జంగంరెడ్డి పల్లి గ్రామానికి మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యులు డీకే అరుణ ఎంపీ నిధుల నుంచి మంజూరు చేసిన హైమాస్ట్ లైట్ ఏర్పాటుకు అరుణమ్మ ఆదేశానుసారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా.బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి స్థల పరిశీలన చేసి భూమి పూజ చేశారు, మండలంలోని ఇప్పటికే పలు గ్రామాలలో హైమాక్స్ లైట్స్ ఏర్పాటు చేశామని మిగిత గ్రామాలలో త్వరలో పూర్తి చేస్తామని కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చే నిధులు, పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఇట్టి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మెట్ల భగవంతు ఉప సర్పంచ్ జగదీశ్వర్ రెడ్డి జిల్లా నాయకులు లలిత వెంకట రెడ్డి నర్వ మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి విజయ్ రామ్ టెలికాం మెంబర్ పసుల నీరజ్ తదితరులు పాల్గొన్నారు.

## నులిపురుగుల నిర్మూలనలో భాగస్వాములు కండి

- మండల వైద్యాధికారిణి డాక్టర్ మనుప్రియ



**జడ్చర్ల, జూలై 13 (జనంసాక్షి):** జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం కార్యక్రమంలో భాగంగా 1 నుండి 19 ఏళ్లలోపు పిల్లలందరికీ ఆల్బెండాజోల్ మాత్రలు అందేలా చూడాలని, ఇందుకోసం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు బాధ్యతగా వ్యవహరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జడ్చర్ల మండల వైద్యాధికారిణి డాక్టర్ మనుప్రియ పిలుపునిచ్చారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా సోమవారం అర్హులైన పిల్లలకు ఆల్బెండాజోల్ మాత్రలను అందజేశారు. నులిపురుగుల వల్ల కలిగే ఆరోగ్య సమస్యలను నివారించి, పిల్లల పోషకాహార స్థితి మరియు ఎదుగుదలను మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో 22,900 మంది లక్ష్యానికి గాను 20,207 మందికి, జడ్చర్ల రూరల్ పరిధిలో 14,489 మంది లక్ష్యానికి గాను 13,873 మందికి ఇప్పటివరకు మాత్రలు పంపిణీ చేసినట్లు వివరించారు. మిగిలిన అర్హులైన పిల్లలకు ఈనెల 20వ తేదీ వరకు ప్రత్యేకంగా మాత్రలు పంపిణీ చేసి వంద శాతం లక్ష్యాన్ని చేరుకుంటామని, ఈ ప్రక్రియలో ప్రజలందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# చారకొండ కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

- విద్యార్థినులతో ముచ్చటించి విద్యా ప్రమాణాలు, మెనూ అమలుపై ఆరా

**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, జూలై 13(జనంసాక్షి):** కేజీబీవీల్లో విద్యా ప్రమాణాలను మరింత మెరుగు పరచడంతో పాటు విద్యార్థినులకు ప్రభుత్వం అందిస్తున్న అన్ని సౌకర్యాలు నాణ్యతతో అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ప్రత్యేక అధికారిని, ఉపాధ్యాయులను ఆదేశించారు. సోమవారం చారకొండ మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ను ఆయన ఆకస్మికంగా సందర్శించి పాఠశాల నిర్వహణ, విద్యా బోధన, వసతి, భోజన ఏర్పాట్లు, విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాల ఆవరణ, తరగతి గదులు, వసతి గదులు, తాగునీటి సదుపాయాలు, పరిశుభ్రత, మరుగుదొడ్లను పరిశీలించారు. పాఠశాలలో నిర్వహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన, విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన సౌకర్యాలు అందించాలని అధికారులకు సూచించారు.

అనంతరం 9వ తరగతి తరగతి గదికి వెళ్లిన కలెక్టర్ విద్యార్థినులతో ప్రత్యక్షంగా మాట్లాడారు. జీవశాస్త్రం సబ్జెక్టుకు సంబంధించిన ప్రశ్నలు అడిగి వారి అభ్యాస స్థాయిని అంచనా వేశారు. పాఠ్యాంశాలను కేవలం కంఠస్థం చేయకుండా, ప్రతి అంశాన్ని పూర్తిగా అర్థం చేసుకుని చదివితేనే పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించవచ్చని విద్యార్థినులకు సూచించారు.

విద్యార్థినులతో ఆత్మీయంగా ముచ్చటించిన కలెక్టర్, కేజీబీవీలో విద్యాభ్యాస వాతావరణం, హాస్టల్ సౌకర్యాలు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, భద్రత, వైద్య సేవలు తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. తమకు ఎదురయ్యే సమస్యలను ఎలాంటి సంకోచం లేకుండా ఉపాధ్యాయులు, ప్రత్యేక అధికారి దృష్టికి తీసుకురావాలని సూచించారు.

పాఠశాలలో అందిస్తున్న భోజన నాణ్యతపై కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. ప్రభుత్వం నిర్దేశించిన వారాంతపు మెనూ ప్రకారం ప్రతిరోజూ ఆహారం అందిస్తున్నారా లేదా అనే విషయాన్ని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. భోజనం రుచి, నాణ్యత, పరిమాణం, పోషక విలువలపై ఆరా తీశారు. విద్యార్థినుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన ఆహారం అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఉపాధ్యాయులతో సమావేశమైన కలెక్టర్, బాలికల విద్యాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రతి విద్యార్థిని నేర్చుకునే సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేసి వెనుకబడిన వారికి అదనపు శిక్షణ అందించాలని తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థినులకు ప్రత్యేక అధ్యయన ప్రణాళిక రూపొందించి మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేయాలని సూచించారు. విద్యార్థినులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ,



బాలికల విద్యాభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఉచిత విద్య, వసతి, పోషకాహారం, పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు వంటి సౌకర్యాలను ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, సమయపాలన, కష్టపడి చదివే అలవాటు విజయానికి పునాది అని పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీల బలోపేతానికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. ప్రత్యేక అధికారి, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేస్తే పాఠశాలలో మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు.

ఈ తనిఖీలో చారకొండ తహసీల్దార్ ఉమా, కేజీబీవీ ప్రత్యేక అధికారి మంజుల, గ్రామ సర్పంచ్, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆల్బెండజోల్ మాత్రతో నులిపురుగులకు చెక్... పిల్లల ఆరోగ్యానికి భరోసా

- ఆరోగ్యవంతమైన పిల్లలే-రేపటి దేశ భవిష్యత్తు
- జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ)అరుణరెడ్డి

**నాగర్ కర్నూల్, జూలై 13 (జనంసాక్షి):**
ఆల్బెండజోల్ మాత్రలతో పిల్లలలో నులిపురుగులను నిర్మూలించి, పిల్లల ఆరోగ్యానికి భరోసా కల్పించవచ్చని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అరుణరెడ్డి తెలిపారు. సోమవారం నాడు నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ అరుణరెడ్డి ప్రారంభించారు.




ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలలో నులి పురుగుల సంక్రమణ వల్ల రక్తహీనత, పోషకాహార లోపం, మానసిక శారీరక ఎదుగుదల కుంటుపడడం, కడుపు నొప్పి, తరచుగా అనారోగ్యానికి గురి కావడం వల్ల పిల్లలు పాఠశాలకు గైర్హాజర్ కావడం వలన చదువులో వెనుకబడతారు. పిల్లలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే వారు చదువులో మెరుగ్గా రాణించగలుగుతారని, కావునజిల్లాలో 1-19 సంవత్సరాల వయసులలో పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయడం ద్వారా నులిపురుగుల సంక్రమణ వల్ల కలిగే నష్టాలను అరికట్టగలమని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. కృష్ణ మాట్లాడుతూ, 2015 సంవత్సరంలో 60 శాతం పిల్లలలో నులిపురుగుల సంక్రమణ ఉండేదని, ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఈ కార్యక్రమం నిర్వహించడం ద్వారా పిల్లలలో 2 శాతానికి నులోపురుగుల సంక్రమణ రేటు కు తగ్గించగలగాని తెలిపారు.

ఆల్బెండజోల్ మాత్రల వల్ల ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవని, తల్లిదండ్రులు తమ పిల్లలకు నిస్సందేహంగా ఆల్బెండజూలు మాత్రలు వేయించాలని డిఎంహెచ్ఓ విజ్ఞప్తి చేశారు. నాగర్ కర్నూల్ జిల్లాలో ఈరోజు 2.2 లక్షల అర్హులైన 1-19 సంవత్సరాల వయసుగల అర్హులైన పిల్లలందరికీ, 1131 అంగన్వాడి కేంద్రాలలో, 900 ప్రభుత్వ , 147 ప్రైవేటు పాఠశాలలు కళాశాలలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని డిఎంహెచ్ఓ డాక్టర్ కే కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలోప్రోగ్రాం అధికారి డాక్టర్ ఆర్. సురేష్ బాబు, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ భరత్ కుమార్ రెడ్డి, పాఠశాల జిహెచ్ఎం భాస్కర్ రెడ్డి, వైద్యాధికారులు డాక్టర్ వాణి, డాక్టర్ మహతి, డాక్టర్ అభిషేక్, ఉప జిల్లా మాస్ మీడియా అధికారి రాజగోపాలాచారి, ఏ పీ ఓ విజయ్, పర్యవేక్షణ సిబ్బంది పసియుద్దీన్, ప్రమీల, ఏఎన్ఎంలు సుజాత, అలివేలమ్మ, ఆర్ బి ఎస్ కే ఫార్మసీ అధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితర ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళా సమాఖ్య భవనానికి భూమి పూజ

**గుండుమాల్ జూలై 13(జనంసాక్షి):**
మహిళలకు ఆర్థికంగా చేయూతను అందించేందుకు రాష్టంలోని ప్రజా ప్రభుత్వం గుండుమాల్ మండలంలోని ముదిరెడ్డిపల్లి గ్రామంలో మహిళా సమాఖ్య భవనాన్ని నిర్మించేందుకు ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి, గ్రామ సర్పంచ్ దేవమ్మ కృష్ణయ్య భూమి పూజ నిర్వహించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో రాష్ట ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించలనే ఆలోచనతో ముదిరెడ్డిపల్లి గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా పది లక్షల రూపాయలతో ఈ భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా హాజరైన మహిళా సమాఖ్య సిసి పిల్లి నర్సిములు మాట్లాడుతూ నాణ్యమైన సిమెంట్, స్టీల్, కంకర, ఇసుకతో నిర్మించాలని కాంట్రాక్టర్ కు సూచనలు ఇచ్చారు. ఈ భవనం ఆర్థిక, సామాజిక అభివృద్ధి కేంద్రంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట ప్రభుత్వం మహిళలకు ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా పలు కార్యక్రమాలు అమలు చేస్తుంది అని తెలిపారు.

ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ మహిళా సమాఖ్య సభ్యులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి అవకాశాలను



పెంపొందించుకొని ఆదాయ వృద్ధి సాధించి కుటుంబాలను అభివృద్ధి పథంలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దేవమ్మ కృష్ణయ్య , గ్రామ పంచాయతీ కార్యదర్శి సత్తయ్య, ఉప సర్పంచ్ బేగారి సత్యమ్మ, వార్డు సభ్యులు, మహిళా సంఘం అధ్యక్షురాలు బోయ సావిత్రి, కోశాధికారి పుష్పమ్మ, కాగ్రెస్ పార్ట్ సీనియర్ నాయకులు బెక్కరి శ్రీనివాస్ రెడ్డి,బెక్కరి శేఖర్ రెడ్డి, పసుల హన్మంతు, బందేరి శివయ్య, గ్రామ సంఘాల మహిళలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ పాపులు తండ్రి మృతికి సంతాపం తెలిపిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



**రేవల్లి, జూలై 13 (జనంసాక్షి):** రేవల్లి మండలంలోని నాగపూర్ గ్రామ మాజీ సర్పంచ్ పాపులు తండ్రి మరణించిన విషయం తెలుసుకున్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించారు.
శోకంలో ఉన్న కుటుంబ సభ్యులను ఓదార్చిన నిరంజన్ రెడ్డి, వారికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతుడి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. ఈ కష్ట సమయంలో పార్టీ శ్రేణులు అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ "పాపులు తండ్రి గ్రామంలో మంచి పేరున్న వ్యక్తి. అందరితో కలివిడిగా ఉండే వారు. ఆయన మరణం తీరని లోటు" అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేవల్లి మండలంలో ఓటు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



**రేవల్లి, జూలై 13 (జనంసాక్షి):**
రేవల్లి మండల కేంద్రంలో జరుగుతున్న ఓటు నమోదు, సవరణ కార్యక్రమాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే నిరంజన్ రెడ్డి ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడిన ఆయన, ఓటు నమోదు ప్రక్రియ సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొత్తగా 18 ఏళ్లు నిండిన యువత, పేరు మార్పులు, చిరునామా మార్పులకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. "ఒక్క ఓటు కూడా వదిలిపెట్టకూడదు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పని చేయాలి" అని నిరంజన్ రెడ్డి అన్నారు. అర్హులైన వారు తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవా లని, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని నిరంజన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతి నిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నులిపురుగుల నివారణతోనే పిల్లల ఆరోగ్యానికి భరోసా

**తెలకపల్లి, జూలై 13, (జనంసాక్షి):**
జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా సోమవారం మండలంలోని మహాత్మా జ్యోతిబా పూలే (బాలుర) గురుకుల పాఠశాల, బాలికల సంక్షేమ గురుకుల కళాశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ఉప సర్పంచ్ వారణాసి శ్రీనివాసులు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సు గల ప్రతి బాలబాలికకు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని సూచించారు. నులి పురుగులను నివారించడం ద్వారా పిల్లలు ఆరోగ్యంగా, బలంగా, చురుకుగా ఎదుగుతారని, "పిల్లల ఆరోగ్యమే దేశ భవిష్యత్తు" అని పేర్కొన్నారు. నులి పురుగుల వల్ల పొట్ట నొప్పి, పోషకాల లోపం, శారీరక ఎదుగుదల మందగించడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వివరించారు. చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవడం, పరిశుభ్రమైన తాగునీటిని వినియోగించడం, బహిరంగ మలవిసర్జనకు దూరంగా ఉండడం వంటి పరిశుభ్రత చర్యలను ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో ఆర్బీఎస్కే వైద్యుడు డాక్టర్ అక్బర్, వైద్య సిబ్బంది వీర్ పాల్, యశోద, కవిత, శాంత, సందీప్ రెడ్డి, రవీందర్ రావు, వార్డు సభ్యులు మల్లేష్, కొమ్ము ఎల్లస్వామి, స్థానికులు రాజేందర్, సుబ్బయ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోస్టాఫీసా..? పార్కింగ్ అడ్డానా..?

- పోస్టాఫీస్ ముందు ట్రాఫిక్‌ను నియంత్రించేవారు లేరా..?
- పోస్టాఫీస్‌లో అసలు ఏం జరుగుతుంది..?
- మేనేజర్ సారు... ఒక్కసారి గేటు బయటకు రండి..!
- పోస్ట్ ఆఫీస్ ముందువాహనాలనిలుపుదలతో పాలసీదారుల ఇక్కట్లు



**కల్వకుర్తి, జులై13, (జనంసాక్షి):** కల్వకుర్తి ప్రధాన పోస్టాఫీస్ ముందు నెలకొన్న అవ్యవస్థపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గేట్ ముందే ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలు వరుసగా నిలిపివేయడంతో పోస్టాఫీస్‌కు వచ్చే వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు గేట్‌లోకి ప్రవేశించడానికే అవస్థలు పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు.

**పోస్టాఫీస్ ముందు ట్రాఫిక్‌ను నియంత్రించేవారు లేరా..?**

పోస్ట్ ఆఫీస్ ముందు ట్రాఫిక్ ను నియంత్రించే వారు లేరా?అనే ప్రశ్న ప్రజల్లో వ్యక్తమవుతోంది.రద్దీ సమయాల్లో గేట్ ఎదుటే వాహనాలు నిలిపివేయడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ట్రాఫిక్ నియంత్రణకు ఎలాంటి చర్యలు లేకపోవడం, పార్కింగ్‌పై పర్యవేక్షణ కనిపించకపోవడంపై వినియోగదారులు మండిపడుతున్నారు.

**పోస్టాఫీస్‌లో అసలు ఏం జరుగుతుంది..?**

పోస్ట్‌ఆఫీస్‌లో అసలు ఏం జరుగుతుందిఅనే సందేహం కూడా వ్యక్తమవుతోంది. ప్రతిరోజూ ఇదే పరిస్థితి కనిపిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడం, గేట్ ముందు వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.కనీసం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం,ప్రత్యేక పార్కింగ్ స్థలం చూపించకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**"మేనేజర్ సారు... ఒక్కసారి గేటు బయటకు రండి..!"**

అనే వ్యాఖ్య ఇప్పుడు వినియోగదారుల నోట వినిపిస్తోంది.గేటు ఎదుట ఉన్న వాస్తవ పరిస్థితిని స్వయంగా పరిశీలించి,వెంటనే పార్కింగ్ నియంత్రణ చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేసి, గేట్ ముందు వాహనాలు నిలపకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## దళిత క్రైస్తవులకు ఎస్సి హోదా కల్పించాలని
## 14న వనపర్తిలో జరుగు జిల్లా సదస్సును జయప్రదం చెయ్యండి

**అమరచింత, జూలై 13 (జనంసాక్షి):** మండలంలోని అమరచింత లో సోమవారం నాడు కరపత్రం ల ను విడుదల చేసిన ఈ సందర్భంగా కెవి పిఎస్ జిల్లా ఉపాధ్యకులు మ్యాతారి వెంకట్రాములు మాట్లాడుతు. జిల్లా సదస్సు కు ముఖ్యఅతిథి గా కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తప్పేట్ల స్కైలాబ్ బాబు హాజరు అవుతున్నారని తెలిపారు. దళితులు క్రైస్తవాన్ని స్వీకరిస్తే రాజ్యాంగపరమైన హక్కులు ఎస్సి హోదా రద్దు అవుతుందని మర్చి 24న న సుప్రీం కోర్ట్ 33పేజీల తీర్పును విలువరించిశీదని ఈ తీర్పు కోట్లాది మంది దళితులను నిరూసహ పరిచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. మతశీ దేవుడు వ్యక్తిగత విశ్వాసలా ఆధారంగా ఉండవచ్చు అని ఆర్టికల్ 25కు వ్యతిరేకంగా సుప్రీం తీర్పు ఉన్నదని విమర్శించారు. దళితులు క్రిస్టియన్ గా మారినంత మాత్రంన కులం మారలేదని అంటరాని తనం కులవివక్షత. పేదరికం పోలేదని విరిపై నిత్యం దాడులు ఏదో ఒక ప్రాంతలో జరుగుతున్నాయని అన్నారు. ఆర్టికల్ 14.15.25.ప్రకారం షెడ్యూల్ కులాలకు పూర్తి మత స్వేచ్ఛ ఇవ్వాలని. షెడ్యూల్ కులాల హక్కులను హరించే 1950రాష్ట్రపతి ఉత్తర్వులను వెంటనే రద్దు చేసి దళిత క్రిస్టియన్ లకు ఎస్సి హోదా హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లలో తెలంగాణ వ్యవసాయకార్మిక సంఘశీ జిల్లా అధ్యక్షులు యస్. అజయ్. సిఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు యస్. రాజు.రాజ్యాంగపరిరక్షణ సమితిఉమ్మడి జిల్లా కో కన్వీనర్ యస్. విజయ్.కెవిపిఎస్ మండలకార్యదర్శి ఎస్సి అరుణ్ కుమార్. ఎంబి చర్చ్ కార్యదర్శి యస్. శ్రీనివాస్. సహాయ కోశాధికారి యస్. శ్యామ్. యస్. రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఏఎస్ఐ నవీన్ కుమార్ సేవలు అభినందనీయం

- చేర్యాలలో ఘనంగా పదవి విరమణ వేడుకలు



**చేర్యాల, జులై 13 (జనంసాక్షి) :** చేర్యాల ఏ ఎస్ఐ గా గత కొన్ని సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న నవీన్ కుమార్ పదవి (ఉద్యోగ) విరమణ పొందారు. ఈ వేడుకలు మండల కేంద్రంలోని రేణుక గార్డెన్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పోలీస్ అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరై ఆయన సేవలను కొనియాడారు. అనంతరం శాలువాలతో ఘనంగా సత్కరించారు. ప్రతి ఉద్యోగికి పదవి విరమణ తప్పదన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ విధి నిర్వహణలో నీతి, నిజాయితీ నిబద్ధతగల పోలీస్ అధికారిగా చేర్యాల ప్రజలకు అనేక సేవలందించి ప్రజల మన్ననలు పొందారు. ఆయన చేసిన సేవలను గుర్తు చేస్తూ అభినందించి పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలి



**అమీన్పూర్, జులై 13 (జనంసాక్షి):** వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజన అధికారులను ఆదేశించారు. సోమవారం శేర్లింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ అమిత్ తో కలిసి అమీన్పూర్ సర్కిల్ పరిధిలోని బీరంగూడ డివిజన్లో పర్యటించారు. బిహెచ్ఎల్ మెట్రో కాలనీలో భూగర్భ డ్రైనేజీ, సిసి రోడ్ నిర్మాణ పనులను, తులసివనం కాలనీలో చెరువు కట్టను పరిశీలించారు. అనంతరం కాలనీవాసులతో మాట్లాడుతూ వారి సమస్యలను తెలుసుకున్నారు. వర్షాకాలంలో వరదలు వస్తే ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రోగాలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆమెతోపాటు అమీన్పూర్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటరమణ, అసిస్టెంట్ ఇంజనీర్లు సునీల్ శివకుమార్ టౌన్ ప్లానింగ్ ఏసీపి ప్రసాద్ ఉన్నారు.

## కూరెళ్లలో
## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



**కోహెడ, జులై 13 (జనంసాక్షి):**

మండలంలోని తంగళ్ళపల్లి గ్రామంలో బాలవికాస ఆధ్వర్యంలో సోమవారం కరీంనగర్ సన్‌రైజ్ హాస్పిటల్ వారిచే నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని స్థానిక సర్పంచ్ బోయిని సంపత్ కుమార్ ప్రారంభించి ఆరోగ్యపరీక్షలు చేయించుకున్నారు. శిబిరంలో సుమారు 300 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా 50 వేల విలువ చేసే మందులను పంపిణీ చేశారు. పరీక్షలు నిర్వహించిన ఐదుగురిని ప్రధాన ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, వైద్య శిబిరం సూపర్వైజర్ కొత్తూరి రాజేందర్, వైద్యులు, డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ హరియా, బాల వికాస ఏరియా కోఆర్డినేటర్ సుజాత, ఆసుపత్రి కోఆర్డినేటర్ శాతం సతీష్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు అలాగే మండలంలోని కూరేళ్ళ గ్రామంలో బాల వికాస ఆధ్వర్యంలో కోహెడ మండల కేంద్రంలోని సాయికృష్ణ ఆసుపత్రి ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించింది ఇందులో వైద్యులు డాక్టర్ శ్రీనివాసరావు, గైనకాలజిస్ట్ డాక్టర్ పూజార్శిని, వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు 150 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బండారి లక్ష్మి - బాలరాజు, బాలవికాస ఏరియా కోఆర్డినేటర్ కె అన్నమేరి, ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్, ఆసుపత్రి సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## శిల ఫలకని
## ఆవిష్కరించిన కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**గద్వాల నడిగడ్డ,జులై 13 (జనంసాక్షి);**

జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండల కేంద్రంలో 339.39 కోట్ల వ్యయంతో 126 కిలోమీటర్ల రహదారుల అభివృద్ధికి సోమవారము శంకుస్థాపన చేసి శిల పలకని ఆవిష్కరించి బహిరంగ సభలో పాల్గొన్న రాష్ట్ర రోడ్లు మరియు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు, గద్వాల శాసన సభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి. మేకల గొర్రెల తెలంగాణ కార్పొరేషన్ చైర్పర్సన్ సరిత , పాల్గొన జిల్లా అధికారులు, నాయకులు, తదితరులు.

## అంతరాష్ట్ర రోడ్డుని పూర్తిచేయండి

**అయిజ, జులై 13 (జనంసాక్షి):** అయిజ మండలం తుప్పత్రాల, మేడికొండ,పులికలు వరకు నిలిచిపోయిన అంతర్రాష్ట్ర రోడ్డును పూర్తి చేయాలని తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికు వినతిపత్రం అందజేసిన కాంగ్రెస్ నాయకులు తుప్పత్రాల మల్లికార్జున్ గౌడ్. గత కొన్ని సంవత్సరాలుగా రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమైన ఎమ్మిగనూరు ఆదోని, మరియు కర్ణాటక బళ్ళారి,ప్రాంతాలకు జోగులాంబ గద్వాల జిల్లా ఐజ మండలం మీదు గా వెళ్లవలసి ఉన్నది. కానీ ఇంతవరకు పూర్తి చేయకపోవడంతో, ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ విషయం పట్ల స్పందించాలని మంత్రిని కోరిన తుపత్రాల మల్లికార్జున గౌడ్.

## భవనానికి మరమ్మత్తులు చేపడుతాం

- మెదక్ జిల్లా వైద్యాధికారి జ్ఞానేశ్వర్



**పాపన్నపేట, జులై 13 (జనంసాక్షి):** పాపన్నపేట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి జ్ఞానేశ్వర్ సోమవారం పరిశీలించారు. ఆసుపత్రిలోని గదులను, రోగులకు సేవలాందిస్తున్న భవనాన్ని పరిశీలించి,పరిస్థితిని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ ఆసుపత్రి భవనానికి మరమ్మత్తులు చేపట్టే విధంగా తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈసందర్భంగా ఆయన వెంట వైద్యాధికారులు హరిప్రసాద్, అన్వర్,సిబ్బంది చందర్ ఉన్నారు.

## నులిపురుగుల
## నివారణతోనే చిన్నారుల ఆరోగ్య వికాసం

**నార్సింగి, జూలై 13 (జనంసాక్షి):** జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా నార్సింగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మండల వైద్యాధికారి డాక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరవ తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ, నులిపురుగుల నివారణ వల్ల పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం వంటి సమస్యలు తగ్గడంతో పాటు శారీరక, మానసిక ఎదుగుదలకు ఎంతో దోహదపడుతుందని తెలిపారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రను తీసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, భోజనం ముందు మరియు మరుగుదొడ్డి వినియోగం తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవడం, పరిశుభ్రమైన ఆహారం తీసుకోవడం వంటి అలవాట్లను అలవరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆకుల సుజాత మల్లేశం గౌడ్, తహసీల్దార్ గ్రేస్ బాయి, మండల విద్యాధికారి గంగాబాయి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవిచందర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్వైజర్లు శ్రీనివాస్, ఉమారాణి, హెల్త్ అసిస్టెంట్ కృష్ణ, ఏఎన్ఎం సుగుణ, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## సంఘటితమే సంఘానికి శ్రీ రామరక్షా

- మున్నూరుకాపు రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుట్టం పురుషోత్తమ రావు



**శివ్వంపేట, జూలై 13 (జనంసాక్షి):** సంఘటితమే సంఘానికి శ్రీ రామ రక్షా అని తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుట్టం పురుషోత్తమ రావు పేర్కొన్నారు. ఇటీవల వేములవాడలో జరిగిన రాష్ట్ర కార్య వర్గ సమావేశానికి కల్లూరి హన్మంత్ రావు రాలేకపోవడంతో రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుట్టం పురుషోత్తమ రావు సోమవారం హన్మంత్ రావు ఇంటికి వెళ్లి ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు. అతర్వాత సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కల్లూరి హన్మంత్ రావు పటేల్ ను శాలువా తో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు పురుషోత్తమ రావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మిగిలిపోయిన మండల కమిటీలతోపాటు, సభ్యత్వ నమోదు, గుర్తింపు కార్డుల జారిపై రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. క్షేత్రస్థాయి నుంచి సంఘం యొక్క బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై హనుమంతరావు తో కూలంకశంగా చర్చించామన్నారు. సంఘాల యొక్క సమ్మేళనమే సమాజమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి ఆకుల సత్యానారాయణ పటేల్, మున్నూరు కాపు మహిళా పరస్పర సహకార సంఘం వైస్ చైర్ పర్సన్, మాజీ సర్పంచ్ కల్లూరి కీర్తన లు ఉన్నారు.

## కాలుష్య కర్మాగారానికి కౌంట్‌డౌన్..

- ఇథనాల్ ఫ్యాక్టరీ మూసివేతకు అఖిలపక్షం అల్టిమేటం
- వెయ్యి మందికి పైగా ప్రజలతో భారీ ర్యాలీ.. తహసీల్దార్‌కు వినతిపత్రం





**బెజ్జంకి, జూలై 13 (జనంసాక్షి):** మండల ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, రైతుల జీవనాధారాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తూ బెజ్జంకి మండల కేంద్రంలో సోమవారం అఖిలపక్షం ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చౌరస్తా నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు వెయ్యి మందికి పైగా ప్రజలు, రైతులు, మహిళలు, యువకులు, వివిధ రాజకీయ, ప్రజా, సామాజిక సంఘాల నాయకులు పాల్గొని ఇథనాల్ ఫ్యాక్టరీని వెంటనే మూసివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
నిరసనకారులు "కాలుష్యానికి అడ్డుకట్ట వేయండి", "ఇథనాల్ ఫ్యాక్టరీని వెంటనే మూసివేయాలి", "ప్రజల ప్రాణాల కంటే పరిశ్రమలు గొప్పవి కావు" అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఇథనాల్ పరిశ్రమ నుంచి విడుదలవుతున్న వ్యర్థ జలాలు చెరువులు, వాగులు, భూగర్భ జలాలను కలుషితం చేస్తున్నాయని ఆరోపించారు. ముఖ్యంగా తోటపల్లి రిజర్వాయర్ నీరు కూడా కాలుష్యానికి గురవుతోందని, దీనివల్ల సాగునీరు దెబ్బతిని రైతుల పంటలకు నష్టం వాటిల్లుతోందని తెలిపారు. కలుషిత నీటిని తాగి పశువులు మృతి చెందుతున్నాయని, ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న దుర్వాసనలు, విషవాయువుల కారణంగా చిన్నారులు, మహిళలు, వృద్ధులు శ్వాసకోశ, చర్మ సంబంధిత వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డా. రసమయి బాలకిషన్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ కంటే ఏ పరిశ్రమ కూడా గొప్పది కాదన్నారు. కాలుష్యానికి కారణమవుతున్న పరిశ్రమపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే కలెక్టరేట్ ముట్టడి, రాస్తారోకోలు, నిరవధిక ఆందోళనలు చేపట్టి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని అఖిలపక్ష నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, బీఎస్పీ, ఎమ్మార్పీఎస్, రైతు సంఘాలు, ప్రజా సంఘాల నాయకులతో పాటు మండలంలోని పలు గ్రామాల ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## నులిపురుగుల నివారణతోనే చిన్నారుల ఆరోగ్య వికాసం



**నార్సింగి, జూలై 13 (జనం సాక్షి):** జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా నార్సింగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మండల వైద్యాధికారి డాక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరవ తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆకుల సుజాత మల్లేశం గౌడ్, తహసీల్దార్ గ్రేస్ బాయి, మండల విద్యాధికారి గంగాబాయి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవిచందర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్వైజర్లు శ్రీనివాస్, ఉమారాణి, హెల్త్ అసిస్టెంట్ కృష్ణ, ఏఎన్ఎం సుగుణ, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఆలేరు ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచిత నోట్‌బుక్స్ పంపిణీ




**తెలకపల్లి, జూలై 13, (జనంసాక్షి):** మండల పరిధిలోని ఆలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం నవజీవన్ రూరల్ డెవలప్మెంట్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత నోట్‌బుక్స్ పంపిణీ సోమవారం చేశారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరహరి అధ్యక్షత వహించగా, ఆలేరు గ్రామ సర్పంచ్ తగిలి ఆనంద్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు సర్పంచ్, ప్రధానోపాధ్యాయుల చేతుల మీదుగా విద్యార్థినీ, విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు విద్యార్థుల్లో చదువుపై మరింత ఆసక్తిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, నవజీవన్ రూరల్ డెవలప్మెంట్ సంస్థ ప్రతినిధులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## అల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేసుకోవాలి



**పుల్కల్, జూలై 13 (జనంసాక్షి):** నులిపురుగుల నివారణకు ప్రతి ఒక్కరూ అల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేసుకోవాలని పుల్కల్ వైద్యాధికారి డాక్టర్ శ్వేత సూచించారు. సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు తీసుకువచ్చిన చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. అలాగే ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల వద్దకు వైద్య సిబ్బంది వెళ్లి ఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు. అర్హులైన పిల్లలు, ప్రజలు వైద్య సిబ్బంది సూచనల మేరకు అల్బెండజోల్ మాత్రలను తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు.

## పామ్ ఆయిల్‌తో అధిక రాబడి



**అల్లాదుర్గం జూలై 13 (జనంసాక్షి):** పామ్ ఆయిల్ మొక్కల పెంపకం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొప్పుల శేషారెడ్డి అన్నారు. మండల పరిధిలోని సీతానగర్ గ్రామంలో రైతు లింగయోల్ల లక్ష్మీ నర్సింలు వ్యవసాయ క్షేత్రంలో పామాయిల్ మొక్కలను నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం పామ్ ఆయిల్ మొక్కలను పెంచడానికి రైతులకు అధిక సబ్సిడీలు ఇస్తుందని ఈ అవకాశాన్ని రైతులు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ నవీన్ కుమార్, ఫీల్డ్ సూపర్వైజర్లు జాన్సన్, నజీర్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

## పుల్కల్ మండల ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా ఎర్ర శేఖర్



**పుల్కల్, జూలై13 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండల ఉపసర్పంచుల ఫోరం నూతన కమిటీని సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి మండలంలోని 19 మంది ఉపసర్పంచులు హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ సమక్షంలో నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో సింగూర్ గ్రామానికి చెందిన ఎర్ర శేఖర్‌ను అధ్యక్షుడిగా, మిన్పూర్ గ్రామానికి చెందిన గోరిల్ల రమేష్‌ను ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. పెద్దారెడ్డిపేట గ్రామానికి చెందిన శశికళ, పుల్కల్‌కు చెందిన కాశగారి ప్రవీణ్‌కుమార్‌లను సహాయ కార్యదర్శులుగా, లక్ష్మీసాగర్‌కు చెందిన నేనావత్ చాప్లా నాయక్‌ను సలహాదారుగా నియమించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఎర్ర శేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 1,279 మంది ఉపసర్పంచులంతా ఒకే కుటుంబంగా, ఐక్యంగా ఉంటూ ఉపసర్పంచుల ఆత్మగౌరవం, హక్కుల సాధన కోసం కృషి చేస్తామని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల ఉపసర్పంచులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కోహీర్ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టి.సువర్ణ మల్లన్న పాటిల్‌కు ఘన సన్మానం




**కోహీర్, జూలై 13 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కోహీర్ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ టి. సువర్ణ మల్లన్న పాటిల్ గారిని కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తూ, పార్టీ బలోపేతానికి అహర్నిశలు శ్రమిస్తున్న వారి సేవలను కొనియాడుతూ శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. సన్మానానికి స్పందించిన శ్రీ టి. సువర్ణ మల్లన్న పాటిల్ మాట్లాడుతూ, తనపై చూపిన ప్రేమాభిమానాలకు, గౌరవానికి ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.
కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా కార్యకర్తలందరినీ కలుపుకొని ముందుకు సాగుతూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తానని, పార్టీ అభివృద్ధి కోసం మరింత అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అక్షయ్, జడ వెంకటాపూర్ సర్పంచ్ అశోక్, కావెల్లి కృష్ణ, ఎల్లిహాస్, నర్సింలు, చిన్న రాజు తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నట్టల నివారణకు అల్బెండాజోల్ మాత్రలు తప్పనిసరి

- **టిజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి**

**సంగారెడ్డి, జూలై 13(జనంసాక్షి):** నట్టల నివారణకు అల్బెండాజోల్ మాత్రలు తప్పనిసరిగా వేసుకోవాలని టిజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి అన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని సోమవారం పోతిరెడ్డిపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కాగా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ లలితాదేవి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ.. 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల ప్రతి విద్యార్థి అల్బెండాజోల్ మాత్రలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. నులిపురుగుల నివారణతో పిల్లల ఆరోగ్యం మెరుగుపడుతుందని చెప్పారు. మలవిసర్జన అనంతరం, భోజనానికి ముందు చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవడం అలవాటు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ లలితాదేవి మాట్లాడుతూ... జిల్లాలో 4,06, 494 మంది విద్యార్థులకు అల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేసే లక్ష్యంతో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ నెల 20వ తేదీలోపు అన్ని విద్యాసంస్థల్లో ఈ కార్యక్రమాన్ని వంద శాతం పూర్తి చేస్తామని చెప్పారు.

జిల్లా రోగనిరోధక టీకాల అధికారి డాక్టర్ శశాంక్ దేశ్‌పాండే మాట్లాడుతూ, 1 నుంచి 3 సంవత్సరాల పిల్లలకు సగం మాత్రను చూర్ణం చేసి ఇవ్వాలని, 3 నుంచి 19 సంవత్సరాల పిల్లలు ఒక మాత్రను నమిలి



మింగాలని వివరించారు. ప్రతి విద్యార్థి ఈ కార్యక్రమంలో పాల్గొని ఆరోగ్య పరిరక్షణకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితా దేవి, జిల్లా రోగనిరోధక టీకాల అధికారి డాక్టర్ శశాంక్ దేశ్‌పాండే, ఆర్‌బీఎస్‌కే బృంద సభ్యులు, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆభరణాల కోసం మహిళ హత్య.. నిందితుడికి జీవిత ఖైదు, రూ.25 వేల జరిమానా

- **ఒంటరి మహిళలనే లక్ష్యంగా చేసుకున్న ద హంతకుడికి యావజ్జీవ కారాగార శిక్ష**
- **నిందితుడికి శిక్ష పడడంలో కృషి చేసిన దర్యాప్తు అధికారులు**
- **పోలీసు సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు**




**మెదక్ బ్యూరో చీఫ్, జూలై 13 (జనంసాక్షి):** ఒంటరిగా సంచరించే మహిళలను లక్ష్యంగా చేసుకుని ఆభరణాల కోసం దారుణ హత్యకు పాల్పడిన నిందితుడికి జిల్లా న్యాయస్థానం జీవిత ఖైదుతో పాటు రూ.25 వేల జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ పట్టణానికి వచ్చిన బుజలి అనే మహిళతో కేతావత్ గోపాల్ అనే వ్యక్తి పరిచయం పెంచుకుని నమ్మకం కల్పించాడు. అనంతరం ఆమెను ఆటోలో శ్రీనివాస వైన్స్‌కు తీసుకెళ్లి మద్యం కొనుగోలు చేశాడు. అక్కడి నుంచి నర్సాపూర్ శివారులో ఆటో దిగి సమీప అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి మద్యం సేవించాడు. మహిళ మెడలో ఉన్న బంగారు ఆభరణాలపై కన్నేసిన నిందితుడు వాటిని దోచుకోవాలనే ఉద్దేశంతో ఆమెను హత్య చేసి అక్కడి నుంచి పరారయ్యాడు. మహిళ ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు 25-03-2025న నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ లింగం మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు మహిళతో కలిసి వెళ్లిన ఆటోను గుర్తించారు. ఆటో డ్రైవర్‌ను విచారించగా, అతడు వారిని దించిన ప్రాంతాన్ని చూపించాడు. అక్కడ అటవీ ప్రాంతంలో గాలింపు చేపట్టిన పోలీసులు కుళ్లిన స్థితిలో ఉన్న మహిళ మృతదేహాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కేసును హత్య కేసుగా మార్చి దర్యాప్తును వేగవంతం చేశారు. అప్పటి నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలను సేకరించి నిందితుడిని అరెస్టు చేసి పక్కా ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసు విచారణ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేష్ సమర్థవంతంగా వాదనలు వినిపించారు. కేసులో సమర్పించిన సాక్ష్యాధారాలు, సాక్షుల వాంగ్మూలాలను సమగ్రంగా పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ, నిందితుడు కేతావత్ గోపాల్‌పై నేరం రుజువైందని నిర్ధారించి, అతనికి జీవిత ఖైదుతో పాటు రూ.25 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో లైజనింగ్ అధికారి ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ రవీందర్ గౌడ్, సీడీఓ హరిబాబు గౌడ్ సహకరించారు. నిందితుడికి శిక్ష పడేలా పక్కా ఆధారాలు సేకరించి సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించిన అప్పటి దర్యాప్తు అధికారి సీఐ జాన్‌రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేష్, లైజనింగ్ బృందం, దర్యాప్తులో పాల్గొన్న పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు అభినందించారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి: ఏఎంసి వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్

**నంగునూరు, జూలై 13, (జనంసాక్షి):** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని ఏఎంసీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్ సంబంధిత అధికారులకు సూచించారు. ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను అత్యంత కచ్చితత్వంతో పూర్తి చేయాలని, ప్రతి దరఖాస్తును నిశితంగా పరిశీలించాలని ఆదేశించారు. ఈ మేరకు సోమవారం సాదుల పవన్ కుమార్ నంగునూరు మండల కేంద్రంలో పర్యటించి, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిని పరిశీలించారు. ఇంటింటికీ ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ ఎలా జరుగుతోందో క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో పాటు, హెల్ప్‌డెస్క్‌ల పనితీరును కూడా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్‌వోలు), సిబ్బందితో మాట్లాడి ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా సాదుల పవన్ కుమార్ మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించాలని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హత కలిగిన యువతి, యువకుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు కావాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ప్రతి ఒక్కరూ దాన్ని వినియోగించుకునేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. ఇంటింటికి వచ్చే బీఎల్‌వోలకు ప్రజలు పూర్తిగా




సహకరించాలని ఆయన కోరారు. ఎన్యూమరేషన్ ఫారాలను సకాలంలో నింపి తిరిగి అందజేయాలని, లేకపోతే ఓటరు జాబితాలో పేరు నమోదు కాకపోవడం లేదా ఓటు హక్కు కోల్పోయే అవకాశం ఉండొచ్చని ప్రజలకు అవగాహన కల్పించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఆలస్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. హెల్ప్‌డెస్క్‌ల ద్వారా ఓటర్లకు నాణ్యమైన సేవలు అందించాలని, వారి సందేహాలను వెంటనే నివృత్తి చేస్తూ ఓటరు నమోదు ప్రక్రియను మరింత సులభతరం చేయాలని సూచించారు.. ఈ కార్యక్రమంలో

పంచాయతీ కార్యదర్శి నితీష్, జిపిఓ దేవరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ నరసింగరావు, రాజమల్లవ్వ,విమల,.లక్ష్మి, లక్ష్మి, సీఏ లు రేణుకా, జహీర్, స్వప్న,సుజాత,లావణ్య, బిల్ కలెక్టర్ అశోక్ కుమార్, లవన్ కుమార్, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నిరుపేదలకు ఆపన్న హస్తం సీఎంఆర్ఎఫ్

- **పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**
- **ఆరు లక్షల యాభై వేల రూపాయల విలువైన ఎల్ఓసిల పంపిణీ**



**పటాన్చెరు, జులై 13(జనంసాక్షి):** ఆపద కాలంలో మెరుగైన వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తుందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బీరంగూడ ఎన్ఎస్ఎల్ కాలనీకి చెందిన పుష్పలత, ప్రగ్య శ్రీ తల్లి కూతుర్లు. ప్రగ్యశ్రీ గత కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతుంది. కిడ్నీ ట్రాన్స్ ప్లాంట్ కోసం స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్నారు. శస్త్ర చికిత్స తదనంతర ఖర్చుల నిమిత్తం మంజూరైన ఆరు లక్షల యాభై వేల రూపాయల విలువైన ఎల్ఓసిని సోమవారం సాయంత్రం వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే జిఎంఆర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఎల్ఓసి లతోపాటు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పారదర్శకంగా పంపిణీ చేస్తున్నమని తెలిపారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# మంత్రుల సభ విజయవంతం

- **ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపిన టౌన్ అధ్యక్షుడు అల్కూరి రవికుమార్**

**మక్తల్, జూలై 13 (జనంసాక్షి):** మక్తల్ నారాయణపేట ఫోర్ లైన్ రోడ్డు ప్రారంభోత్సవానికి విచ్చేసిన మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి జూపల్లి కృష్ణారావు తో పాటు స్థానిక మంత్రివర్యులు వాకిటి శ్రీహరి, విచ్చేసిన ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాసరెడ్డి వీర్లపల్లి శంకర్ 237 కోట్లతో నారాయణపేట రోడ్డు పనులను ప్రారంభించి, అనంతరం ఏర్పాటు చేసిన సభకు పెద్ద ఎత్తున తరలివచ్చిన నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు అందరికీ మక్తల్ కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు అల్కూరి రవికుమార్ ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా తిప్పురాజ్ పల్లి నుంచి మక్తల్ పట్టణం వరకు వేలాది సంఖ్యలో మంత్రి వాకిటి శ్రీహరి తో పాటు బైక్ ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ కార్యకర్తలు, సామాన్య ప్రజలు.. అందరం పెద్ద ఎత్తున టోల్గేట్ వద్ద మంత్రివర్యులకు ఘన స్వాగతం తెలిపి నియోజకవర్గానికి వందల కోట్ల రూపాయల నిధులను కేటాయించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి, సీఎం రేవంత్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## మంత్రుల సభ విజయవంతం

- **ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపిన టౌన్ అధ్యక్షుడు అల్కూరి రవికుమార్**

**మక్తల్, జూలై 13 (జనంసాక్షి):** మక్తల్ నారాయణపేట ఫోర్ లైన్ రోడ్డు ప్రారంభోత్సవానికి విచ్చేసిన మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి జూపల్లి కృష్ణారావు తో పాటు స్థానిక మంత్రివర్యులు వాకిటి శ్రీహరి, విచ్చేసిన ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాసరెడ్డి వీర్లపల్లి శంకర్ 237 కోట్లతో నారాయణపేట రోడ్డు పనులను ప్రారంభించి, అనంతరం ఏర్పాటు చేసిన సభకు పెద్ద ఎత్తున తరలివచ్చిన నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు అందరికీ మక్తల్ కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు అల్కూరి రవికుమార్ ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా తిప్పురాజ్ పల్లి నుంచి మక్తల్ పట్టణం వరకు వేలాది సంఖ్యలో మంత్రి వాకిటి శ్రీహరి తో పాటు బైక్ ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ కార్యకర్తలు, సామాన్య ప్రజలు.. అందరం పెద్ద ఎత్తున టోల్గేట్ వద్ద మంత్రివర్యులకు ఘన స్వాగతం తెలిపి నియోజకవర్గానికి వందల కోట్ల రూపాయల నిధులను కేటాయించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి, సీఎం రేవంత్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



# అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

**కృష్ణ, జూలై 13 (జనంసాక్షి):** కృష్ణ మండలం పోలీస్ స్టేషన్ పరిధిలో రైల్వే స్టేషన్ దగ్గర గుర్తు తెలియని వ్యక్తి అనుమానస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన ప్రకారం రైచూర్ నుండి కృష్ణ లో వారం రోజుల క్రితం కృష్ణకు వచ్చి దిగినారు. అతని చేతిలో ఉన్న క్యారీ బ్యాగ్ చూసి, దానిలో ఉన్న కర్ణాటక కెనరా బ్యాంక్ పాస్ చూసి అతని పేరు అశోక్ తండ్రి పేరు దౌలప్ప (53)వ, మడ్డిపేట, రైచూర్ జిల్లా, అని గుర్తించారు. చేతుల్లో బ్యాగు పట్టుకుని రైల్వే స్టేషన్ ఆటో స్టాండ్ పక్కల వెళ్లే సమయంలో హఠాత్తుగా చనిపోయాడు. వెంటనే హుటాహుటిన పోలీసులు చేరుకుని మృతి చెందినట్లు గుర్తించారు. ఆవ్యక్తి కృష్ణ గ్రామనికి ఎందుకు వచ్చాడన్న విషయం తెలియాల్సి ఉంది. పూర్తి వివరాలను ఎస్సై దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని అంబులెన్స్ లో మక్తల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.



## ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని పరిశీలించిన తహసీల్దార్ విజయ్‌కుమార్



**తెలకపల్లి, జూలై 13, (జనంసాక్షి):** ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమంలో భాగంగా సోమవారం తెలకపల్లి మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని 183, 184, 185, 186, 187, 188 పోలింగ్ బూత్‌లను స్థానిక తహసీల్దార్ విజయ్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఓటర్ల సవరణ ప్రక్రియను పరిశీలించి, ఈఎఫ్ డిజిటైజ్డ్ ఆన్‌లైన్ ఎంట్రీలను వేగవంతంగా పూర్తి చేయాలని బీఎల్‌వోలకు సూచించారు. కార్యక్రమం పూర్తి చేసేందుకు సమయం తక్కువగా ఉన్నందున నిర్దేశిత గడువులోపు ఎంట్రీలను పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం అక్కడ విధులు నిర్వహిస్తున్న బీఎల్‌వోలతో పాటు వివిధ రాజకీయ పార్టీల బీఎల్‌ఏలతో మాట్లాడి, ఓటర్ల నమోదు ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనల మేరకు నిర్వహించాలని సూచించారు.

## టీయూడబ్ల్యూజే (ఐజేయు)జిల్లా కమిటీలో ఎన్నికైన పటాన్‌చెరు జర్నలిస్టులకు సన్మానం





**పటాన్‌చెరు, జులై 13 (జనంసాక్షి):**
జర్నలిస్టుల ప్రతి సమస్యలను పరిష్కరించే దిశగా సంఘం పనిచేస్తుందని టీయూడబ్ల్యూజే (ఐజెయూ) సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బండారి యాదగిరి అన్నారు. టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సంగా రెడ్డి జిల్లా నూతన కమిటీలో ఎన్నికైన పటాన్‌చెరు నియోజకవర్గానికి చెందిన జర్నలిస్టులకు పటాన్ చెరు మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో సోమవారం ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల అక్రిడేషన్ల,ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు సంబంధించిన విషయంపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. ఎన్నికైన జర్నలిస్టులు సంఘం బలోపేతానికి అంకితభావంతో పనిచేసి జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో ముందుండాలని సూచించారు.
జిల్లా కమిటీ సభ్యులు మాట్లాడుతూ తమపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన జిల్లా, రాష్ట్ర కమిటీ సంఘ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం అంకితభావంతో పని చేస్తామని అన్నారు. సన్మాన అభినందన సభ ఏర్పాటు చేసిన సీనియర్ జర్నలిస్టులు రామారావు, రమేష్, అశ్వక్, రాజశేఖర్ సంఘ సభ్యులందరికీ సన్మానితులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మాజీ అధ్యక్షుడు మల్లికార్జున్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు అబ్దుల్ బాసిత్, జిల్లా జనరల్ సెక్రెటరీ అనిల్, జిల్లా ఉపాధ్యక్షుడు పర్చ శ్రీనాథ్, జిల్లా సంయుక్త కార్యదర్శి కే శ్రీనివాస్ రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా జనరల్ సెక్రెటరీ బసవేశ్వర్, జిల్లా సంయుక్త కార్యదర్శి భూపాల్ రెడ్డి, ఈసీ సభ్యులు సయ్యద్ మజీద్ అలీ, మైకోటి శ్రీనివాస్ లను నూతన కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమం లో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నాయకులు, సభ్యులు, స్థానిక జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు సకాలంలో సేవలు అందించడంలో సర్వేయర్లు భాగస్వాములు కావాలి

- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్
- లైసెన్స్డ్ సర్వేయర్లతో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సమీక్ష

**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, జులై 13 (జనంసాక్షి):**
రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న భూ భారతి భూ సమస్యల పరిష్కారాన్ని విజయవంతం చేయడంలో లైసెన్స్డ్ సర్వేయర్లు కీలక పాత్ర పోషించాలని, జిల్లాలోని అన్ని మండలాల్లో అందుతున్న భూ సర్వే దరఖాస్తులను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేసేందుకు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సూచించారు. సోమవారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లాలోని లైసెన్స్డ్ సర్వేయర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార & పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వెల్లడించిన అంశాలను సమావేశంలో సర్వేయర్లకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం భూ సర్వే ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించడం, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించడం, భూ వివాదాలను తగ్గించడం వంటి లక్ష్యాలతో పలు నిర్ణయాలు తీసుకుందని చెప్పారు. భూ సర్వేల నిర్వహణలో లైసెన్స్డ్ సర్వేయర్ల పాత్ర ఎంతో కీలకమని, ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనలకు అనుగుణంగా జిల్లాలోని ప్రతి మండలంలో వచ్చే భూ సర్వే దరఖాస్తులను బాధ్యతాయుతంగా, పారదర్శకంగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా సర్వేయర్లు ముందుకు రావాలని సూచించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా సకాలంలో సేవలు అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వం లైసెన్స్డ్ సర్వేయర్లకు ప్రోత్సాహం కల్పించేందుకు భూ సర్వే నిర్వహించిన ప్రతి ఎకరానికి రీ-సర్వేలో పనిచేసే లైసెన్స్ సర్వేయర్లకు ఎకరానికి రూ.50తో పాటు రవాణా, ఇతర ఖర్చుల నిమిత్తం మరో రూ.10 కలిపి మొత్తం రూ.60 చొప్పున పారితోషికం చెల్లించాలని నిర్ణయించిందని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని సద్వినియోగం చేసుకొని జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సర్వేలను వేగంగా పూర్తి చేయాలని, భూ సర్వేల నిర్వహణలో చురుకుగా పాల్గొనాలని సర్వేయర్లను






కోరారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి సర్వేయర్ పనిచేయాలని కలెక్టర్ అన్నారు. సర్వేల నిర్వహణలో నిబంధనలు తప్పకుండా పాటించాలని, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించి ఖచ్చితమైన సర్వేలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. భూ యజమానుల మధ్య వివాదాలకు అవకాశం లేకుండా రికార్డులు, సరిహద్దులు, భూమి వివరాలను సమగ్రంగా పరిశీలించి సర్వేలు పూర్తి చేయాలని,సర్వేల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని నిలబెట్టేలా ప్రతి సర్వేయర్ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో తమ అభిప్రాయాలను వెల్లడించిన లైసెన్స్డ్ సర్వేయర్లు, ప్రభుత్వం నిర్ణయించిన పారితోషికం, సర్వేల నిర్వహణ విధానం తదితర అంశాలపై జిల్లాలోని సర్వేయర్లందరితో సమావేశమై సమగ్రంగా చర్చించి తుది నిర్ణయాన్ని త్వరలో జిల్లా యంత్రాంగానికి తెలియజేస్తామని కలెక్టర్‌కు వివరించారు.
ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను సానుకూలంగా పరిశీలిస్తామని, జిల్లాలో భూ సర్వేలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సహకరిస్తామని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో, జిల్లా సర్వేయర్ గిరిధర్, రెవెన్యూ శాఖ అధికారులు, వివిధ మండలాలకు చెందిన లైసెన్స్డ్ సర్వేయర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌పై విమర్శలు మాని రైతుల సమస్యలపై దృష్టి పెట్టాలి

- ఎమ్మెల్యే సునీత రెడ్డి



**నర్సాపూర్, జూలై 13 (జనం సాక్షి):** రాష్ట్ర ప్రభుత్వం రైతుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని, బీఆర్ఎస్ పార్టీ నాయకులపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత రెడ్డి అన్నారు. సోమవారం నర్సాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ బీఎల్ఏలకు (బూత్ లెవల్ ఏజెంట్లు) సర్ (Special Intensive Revision - SIR) కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సునీత రెడ్డి మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సాగునీరు అందించాలనే డిమాండ్‌కు సమాధానంగా ముఖ్యమంత్రి అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమని అన్నారు. రైతుల సమస్యలపై స్పందించాల్సిన సమయంలో రాజకీయ విమర్శలకు ప్రాధాన్యం ఇవ్వడం తగదని పేర్కొన్నారు.
రైతులకు సాగునీరు అందించాలనే అంశాన్ని బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, హరీశ్ రావు ప్రస్తావించినందుకు వారిపై విమర్శలు చేయడం సమంజసం కాదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని, రాష్ట్రంలో జరిగిన హత్యలు, చిన్నారులపై జరిగిన దారుణ ఘటనలపై నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు కొనసాగితే పార్టీ తరఫున తగిన విధంగా స్పందిస్తామని హెచ్చరించారు. అనంతరం సర్ కార్యక్రమంపై మాట్లాడుతూ, ఓటరు జాబితా ప్రత్యేక సవరణలో బీఆర్ఎస్ బీఎల్ఏలు చురుకుగా పాల్గొనాలని సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు అయ్యేలా అవగాహన కల్పించాలని కోరారు. ఓటరు జాబితాలో లేని అర్హుల పేర్లను నమోదు చేయించడం, అర్హత లేని పేర్లను తొలగించే ప్రక్రియలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా సంబంధిత ఫారాలను పూర్తి చేసి అధికారులకు అందజేయాలని బీఎల్ఏలకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మన్ దేవేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్ర గౌడ్, జిల్లా మాజీ కో-ఆప్షన్ సభ్యుడు మన్సూర్, మండల అధ్యక్షులు శేఖర్, రామా గౌడ్, ఆంజనేయులు గౌడ్, నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సర్ సవరణలో ప్రజలంతా భాగస్వాములుకండి

- 18 ఏళ్లు నిండిన యువత 100శాతం ఓటు హక్కును పొందాలి
- కోహెడ తహసిల్దార్ సామల నవీన్ కుమార్



**కోహెడ జూలై 13, (జనంసాక్షి):** భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ' ప్రక్రియలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోహెడ తహసిల్దార్ సామల నవీన్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని వివిధ గ్రామాలలో పర్యటించి సవరణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీరాముల పల్లి గ్రామంలో సవరణ ప్రక్రియను పరిశీలించి మాట్లాడుతూ ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి, నకిలీ ఓట్లను అరికట్టడానికి మండలంలోని అన్ని గ్రామా లలో ఇంటింటి ప్రత్యేక సమగ్ర సవరణ పక్రియను ప్రజలందరూ సద్వినియోగ పరచుకోవాలన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు వెన్నుముక లాంటి ఓటరు జాబితాను పారదర్శకంగా తయారు చేయడమే ఈ ప్రత్యేక సర్వే ముఖ్య ఉద్దేశ్యమని తహసీల్దార్ అన్నారు. గతంలో జరిగిన నకిలీ ఓటర్లను అరికట్టడానికి, అర్హులైన ఏ ఒక్కరూ నష్టపోకుండా ఉండడానికి బూత్ లెవల్లో ప్రత్యేక దృష్టి పెట్టాలని బి ఎల్ ఓ లకు సూచించారు. 2026 అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాల వయస్సు నిండే ప్రతి ఒక్క యువతీ, యువకుడు తమ పేరును విధిగా ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలనీ, రాబోయే భవిష్యత్తును నిర్ణయించే శక్తి యువత చేతుల్లోనే ఉందనీ స్పష్టం చేశారు. అలాగే ఓటరు జాబితాలో చనిపోయిన వారి పేర్లు తొలగించి,అలాగే ఒకే వ్యక్తికి రెండు, మూడు చోట్ల ఉన్న నకిలీ ఓట్లను గుర్తించి,ఒక్క చోట మాత్రమే ఉండే విధంగా చూడాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోలు శ్రీనివాస్. ఆర్ఐలు బి ఎల్లయ్య, సంజీవ్ కుమార్, జిపిఓ వనిత ,బి ఎల్ వో లు, బి ఎల్ ఏ లు ,గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.